## ఢిల్లీలో డేంజర్‌బెల్స్ మోగిస్తోన్న వాయు కాలుష్యం..

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. మంగళవారం ఉదయం గాలి నాణ్యత సూచిక ప్రమాదకరస్థాయిలో నమోదైంది. ఏక్యూఐ లెవెల్స్ 425కుపైనే నమోదయ్యాయి. వాయు కాలుష్యం క్షీణించడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో జీఆర్ఏపీ స్టేజ్-3 ఆంక్షలు విధించిందిసెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం.. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో సోమవారం ఉదయం 362గా ఉన్న ఏక్యూఐ లెవెల్స్.. మంగళవారం ఉదయానికి 425గా నమోదయ్యాయి. దీంతో రాజధానిలో ప్రభుత్వం పలు ఆంక్షలు విధించింది. అనవసరమైన నిర్మాణాలు, కూల్చివేత పనులపై నిషేధం విధించింది. వాహన కాలుష్యాన్ని అరికట్టడంలో సహాయపడటానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ కింద మూడో దశ ఆంక్షలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో పెట్రోల్‌తో నడిచే బీఎస్-3, బీఎస్-4 డీజిల్ వాహనాలపై నిషేధం విధించింది.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :222 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 12-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఆపరేషన్ సింధూర్‌కు ప్రతీకారం: కేంద్ర మంత్రి సంచలనం!



న్యూఢిల్లీ,దేశ రాజధాని ఢిల్లీని సోమవారం సాయంత్రం ఓ భారీ పేలుడు ఘటన కుదిపేసింది. ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన ఈ పేలుడు కారణంగా దాదాపు 9 మంది మృతి చెందగా..20 మందికి పైగా గాయపడ్డారు.ఈ భారీ పేలుడు కేసు విచారణ కొనసాగుతోంది. భద్రతా సంస్థలు ఈ దాడికి సంబంధించిన ప్రతి కోణాన్ని పరిశీలిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి, హిందుస్తానీ అవామ్ మోర్చా అధ్యక్షుడు జీతన్‌రామ్ మాంఝీ ఈ ఘటనపై కీలక ప్రకటన చేశారు. ఈ ఘటన తర్వాత బీహార్‌లో కూడా హై అలర్ట్ ప్రకటించారు. బీహార్‌లో రెండో దశ పోలింగ్ జరుగుతున్న సమయంలోనే మాంఝీ ఈ పేలుడుపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం.ఉగ్రవాదుల దృష్టి చాలా కాలం నుంచే ఢిల్లీపై ఉందని.. ఈ తరహా కుట్ర జరుగుతోందనడంలో ఎలాంటి సందేహం లేదని జీతన్‌రామ్ మాంఝీ అన్నారు. ఉగ్రవాదులు 'ఆపరేషన్ సింధూర్'కు ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారని సంచలన ఆరోపణ చేశారు.ఉగ్రవాదులు చాలా కాలంగా ఢిల్లీపైనే దృష్టి సారించినట్లు ఆయన స్పష్టం చేశారు.

బీహార్ ప్రజలకు జీతన్‌రామ్ మాంఝీ విజ్ఞప్తి

బీహార్ ఎన్నికల నేపథ్యంలో జీతన్రామ్ మాంఝీ ప్రజలకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. "మొదటి దశలో ప్రజలు ఏ ఉత్సాహంతో ఓటు వేశారో, అదే ఉత్సాహం, ఐక్యతతో రెండో దశలో కూడా ఓటు వేయాలి. తద్వారా రాష్ట్రంలో అభివృద్ధి పరంపర కొనసాగుతుంది" అని ఆయన కోరారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చేస్తున్న పనిని మాంఝీ కొనియాడారు. "అభివృద్ధి రికార్డులన్నీ బద్దలవుతున్నాయి. రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, పేదల సంక్షేమ పథకాలు వంటి ప్రతి రంగంలోనూ మంచి పని జరుగుతోంది. అందుకే ఈ పురోగతిని కొనసాగించడానికి ఎన్డీయేకు మద్దతు ఇవ్వాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

బీహార్ ప్రజలను హెచ్చరిస్తూ.. ఈ ఎన్నికలు కేవలం ప్రభుత్వం ఏర్పాటు చేసుకోవడానికి మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును సురక్షితం చేసుకోవడానికి జరుగుతున్న ఎన్నికలు అని జీతన్‌రామ్ మాంఝీ అన్నారు. "మనం గనుక పొరపాటు చేస్తే, బీహార్ అభివృద్ధి ప్రయాణం పట్టాలు తప్పుతుంది. పనులు అసంపూర్తిగా ఉండిపోతాయి. మళ్లీ మనం ఎక్కడ మొదలుపెట్టామో అక్కడికే చేరుకుంటాం" అని ఆయన ప్రజలను హెచ్చరించారు. గత కొన్నేళ్లుగా బీహార్ సాధించిన వేగవంతమైన పురోగతి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

ఇతరులు ఏమీ చేయలేరు: తేజస్వీపై విమర్శలు

ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్‌ను పరోక్షంగా లక్ష్యంగా చేసుకుంటూ మాంఝీ విమర్శలు గుప్పించారు. "ఇతరులు బీహార్ కోసం ఏమీ చేయరు. అభివృద్ధి పనులన్నీ ఎన్డీయే ప్రభుత్వంలోనే జరిగాయి. ఇప్పుడు పెద్ద పెద్ద వాగ్దానాలు చేస్తున్నవారు తమ పాలనలో ఏం చేశారో ముందు చెప్పాలి," అని ఆయన ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కారణంగానే ఈ రోజు గ్రామగ్రామాన విద్యుత్, రోడ్లు, పేదలకు నేరుగా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని మాంఝీ నొక్కి చెప్పారు.

## డిండి ఎత్తిపోతల నిర్వాసితులకు అండగా పోరాడుతా



హైదరాబాద్,డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్వాసితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహార, పునరావాస పథకాలు అందేవరకు వారికి అండగా ఉండి పోరాడుతానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. మంగళవారం జనం బాట కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా కిష్టరాయినిపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితులు తమ గోడు చెప్పుకుంటూ కన్నీళ్ల పర్యమంతమయ్యారు. వారిని ఓదార్చిన కవిత తప్పకుండా అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తైతే వేలాది మందికి లాభం జరుగుతుందన్న ఆశతో ప్రాంతం చుట్టు పక్కల ప్రజలు, రైతులు పెద్ద మనసు చేసుకొని తమ భూములు ఇచ్చారని గుర్తు చేశారు. 2015 లోనే తొందరగా ప్రాజెక్ట్ పూర్తై ఉంటే సమస్యలు ఉండకపోయేవని, దాదాపు 11 ఏళ్లు ఆలస్యమైందని, దీంతో అప్పుడు 18 ఏళ్లు నిండని చాలా మందికి ఇప్పుడు 18 ఏళ్లు దాటాయని పేర్కొన్నారు. వారికి కూడా పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. అప్పుడున్న ధరలకు ఇప్పుడున్న ధరలకు చాలా తేడా ఉందని, అంతే కాకుండా నిర్వాసితులకు ఇళ్లు గానీ వేరే కాలనీలు గానీ కట్టించలేదు అని తెలిపారు. ప్రజలను వారికి కట్టించిన ఇళ్లలో దిగపెట్టే వరకు నెల నెల ఖర్చు ఇవ్వాలని చట్టంలో ఉందన్నారు. ఈ నాలుగు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే ఇక్కడకు వచ్చానని కవిత చెప్పారు.

నిర్వాసితులకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అన్యాయం చేశాయి

గతంలో మునుగోడు ఎన్నికలు జరిగినప్పుడు ప్రపంచం మొత్తం ఆ ఎన్నిక గురించి మాట్లాడుకుందని, అంత పెద్ద ఎత్తున ఆ ఎన్నికల్లో ఖర్చు చేశారు అని, అప్పుడు మీకు న్యాయం చేస్తానని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట ఇచ్చారు.ఇప్పుడు మాత్రం అడిగితే పట్టించుకోవటం లేదని మీరే చెబుతున్నారని, ప్రస్తుత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సైతం మీకు న్యాయం చేస్తానని మాట ఇచ్చారని గుర్తు చేశారు. మిడ్ మానేర్ కు కట్టినప్పుడు కేటీఆర్ నియోజకవర్గంలో, మల్లన్న సాగర్ కట్టిన సమయంలో కేసీఆర్ నియోజకవర్గం ప్రజలకు న్యాయం చేసినట్లు చేస్తానని రాజగోపాల్ రెడ్డి చెప్పారని, ఉదయం సముద్రం, శివన్నగూడెం, కిష్టరాంపల్లి, లక్ష్మణ పురం ప్రజలకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇప్పిస్తానని చెప్పారని, కానీ ఇప్పుడు ఆయన కూడా పట్టించుకోవటం లేదు అని కవిత విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వాన్ని పదే పదే అడిగి ఒత్తిడి తేవాల్సిన అవసరముందన్నారు. అందుకే నేను మీ దగ్గరకు వచ్చానని. మేము రావటం కారణంగా మీకు 2 రూపాయలు లాభమైనా నా జన్మ ధన్యమైనట్లేనన్నారు.

పనుల ఆలస్యంతో నిర్వాసితుల సమస్యలు మరింత జఠిలం

ఇక్కడకు వచ్చాక కాంట్రాక్టర్ తో మాట్లాడితే..4 నెలలుగా వాళ్లకు కూడా ఈ ప్రభుత్వం డబ్బులు ఇవ్వటం లేదంటని%ొ% కట్టపోసుడు బంద్ పెట్టినం అని చెబుతున్నాడని కవిత వెల్లడించారు. అంటే ఈ ప్రాజెక్ట్ ఇంకా ఆలస్యమయ్యే పరిస్థితి ఉందని, ఆ లోపల మనం ఇళ్ల జాగాలు సాధించుకోవాల్సిన అవసరముందని, కొంతమంది ఇబ్రహీంపట్నం, మరికొంతమంది చింతపల్లి లో ల్యాండ్ కావాలని అడుగుతున్నారన్నారు. ఈ అంశానికి సంబంధించి ఒక తారీఖు అనుకొని నల్గొండలో లేదంటే హైదరాబాద్ లో మనం ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుదామని తెలిపారు. పంతం పట్టి అడిగితేనే పనులు అయ్యే పరిస్థితి ఉందని, మొత్తం డిండి పరివాహక ప్రాంతంలో పనులు ఆగిపోయాయని, చాలా పనులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆలస్యం చేస్తున్న కొద్దీ నష్టం ఎక్కువ అవుతోందని, ఇది వరకు రైతులుగా ఉన్న వారు కూలీలు అయ్యారని చెబుతుంటే బాధకరంగా ఉందన్నారు. ఇక కూలీలు ఏమైపోయారో తెలియని పరిస్థితి. ఊరంతా వలస పోయారన్నారు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వాల తీరు సరిగా లేదని, వారికి న్యాయం చేయాలని, వెంటనే వారికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాని కవిత తెలిపారు. లేదంటే ఇక్కడ యువతతో కలిసి హైదరాబాద్ లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యాచరణకు దిగుతామని ప్రకటించారు.

## అలా చేస్తే కాంగ్రెస్ పార్టీకి కూడా మద్దతిస్తాం: ఆర్ఎస్ఎస్



న్యూఢిల్లీ,రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)బీజేపీ హ్యాట్రిక్ విజయాల వెనుక ఉన్న శక్తి. చాలామంది బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే.ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే బీజేపీ నడుస్తుందని, చాలా టికెట్లు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రికమండేషన్ పై ఫిక్సవుతుంటాయని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తుంటారు.హిందుత్వ ఎజెండాను బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లే ఆర్ఎస్ఎస్ కు అనుబంధంగా ఉన్న బీజేపీ హ్యాట్రిక్ విజయాలు సాధించింది. ఆర్ఎస్ఎస్ మద్దతు ఎల్లప్పుడూ బీజేపీకి తప్ప కాంగ్రెస్ కు ఉండే ఛాన్సే లేదన్న భావన జనాల్లో పాతుకుపోయింది. అయితే, అది కరెక్టు కాదంటున్నారు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్.తాము పాలసీలకు మద్దతిస్తామని, పార్టీలకు, మనుషులకు కాదని భగవత్ అన్నారు. అయోధ్యలో రామ మందిరం కట్టాలన్నది కోట్లాది మంది హిందువుల కల అని, ఆ కల నెరవేర్చాలన్నది ఆర్ఎస్ఎస్ ఆశయం అని ఆయన చెప్పారు. రామ మందిర నిర్మాణానికి బీజేపీ నడుం బిగించడంతోనే ఆర్ఎస్ఎస్ ఆ పార్టీకి మద్దతిచ్చిందని అన్నారు. ఒకవేళ రామ మందిరం నిర్మిస్తామని కాంగ్రెస్ చెప్పి ఉంటే ఆ పార్టీకి మద్దతిచ్చేవారమని స్పష్టం చేశారు.ఓటు రాజకీయాల్లో తాము పాల్గొనబోమని, సమాజాన్ని ఏకం చేయడమే సంఘ్ పరివార్ లక్ష్యమని అన్నారు. కానీ, సమాజాన్ని విభజించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడమే రాజకీయ పార్టీల స్వభావనమి, అందుకే రాజకీయాలకు తాము దూరంగా ఉంటామని చెప్పారు.తాము రాజకీయాలకు మద్దతిస్తామని, పాలసీల పరంగా ఆ మద్దతు ఉంటుందని తెలిపారు. అయితే, చెప్పడానికి ఇదంతా బాగానే ఉందని, కానీ, ఆర్ఎస్ఎస్ సెక్యూలర్ భావజాలాన్ని కలిగి ఉండదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ సెక్యూలర్ భావజాలాన్ని కలిగి ఉంటుందని, కాబట్టే ఆ పార్టీకి ఆర్ఎస్ఎస్ మద్దతునివ్వడం దాదాపుగా అసాధ్యమని అంటున్నారు.

## ఘట్‌కేసర్‌లో కవి అందెశ్రీ అంత్యక్రియలు.. పాడి మోసిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం పూర్తి అయ్యాయి. ఘట్‌కేసర్‌లో నిర్వహించిన అంతిమ సంస్కారాలకు సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు, మిగతా పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు.

ఘట్‌కేసర్‌లో కవి అందెశ్రీ అంత్యక్రియలు

కవి అందెశ్రీ పాడెను సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మోశారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించింది. అంతకుముందు లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి ఘట్‌కేసర్‌కు ఆయన అంతిమయాత్ర సాగింది. తార్నాక, ఉప్పల్, ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్ మీదుగా సాగింది.ఆ సమయంలో వేలాది మంది అందులో పాల్గొన్నారు. ప్రజా సంఘాల నేతల చివరిసారిగా తమ పాటలతో వీడ్కోలు పలికారు. అంతిమ సంస్కారాలకు ముందు అందెశ్రీ కుటుంసభ్యులకు సీఎం రేవంత్‌రెడ్డి ఓదార్చారు. అంతిమ సంస్కారాలకు ముందు అందరూ రెండు నిమిషాల సేపు మౌనం పాటించారు. అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య.

పాడి మోసిన సీఎం రేవంత్‌రెడ్డి

కాకతీయ యూనివర్సిటీ నుంచి ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆశు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. 2006లో గంగ సినిమాకు అందెశ్రీకి నంది పురస్కారం వరించింది. 2015లో దాశరథి సాహితీ పురస్కారం అందుకున్నారు. అదే ఏడాది రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం వరించింది. 2022లో ఆయనకు జానకమ్మ జాతీయ పురస్కారం దక్కించుకున్నారు.గతేడాది దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారంతోపాటు లోక్ నాయక్ పురస్కారం ఆయన సొంతం చేసుకున్నారు. సోమవారం ఉదయం అందెశ్రీ తన ఇంట్లో కుప్పకూలారు. వెంటనే ఆయన్ని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు డాక్టర్లు ప్రకటించారు. తెలంగాణే కాకుండా దేశ వ్యాప్తంగా రచయితలు, కవులు, కళాకారులు, రాజకీయ, సినీ ప్రముఖులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

## మూడు రోజుల పాటు ఎర్రకోట బంద్



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న ఎర్రకోట సమీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ పేలుడు ధాటికి 13 మంది మృతిచెందగా, 20 మంది వరకు గాయపడ్డారు. అయితే ఈ నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు విజిటర్స్‌కు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది.

కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది.కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూ ల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను ఇవాళ మూసివేశారు.

## అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసులు: మాగంటి సునీత



హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపట్ల బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం అందరూ పనిచేయాలని, అధికార పార్టీకి అనుకూలంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ గూండాలు దౌర్జన్యం చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు బూత్‌లలో యథేచ్ఛగా తీరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు రౌడీయిజం చేస్తున్నారని చెప్పారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నేతలు దాడులు చేస్తున్నారన్నారు. 13వ తేదీ వరకు ఎంత ఇబ్బంది పెడతారో పెట్టండని, 14వ తేదీ తర్వాత చూసుకుందామన్నారు. బోరబండలో రౌడీ షీటర్ ప్రజలను బెదిరిస్తుంటే అతనికి సహకరిస్తారా అని ఫైర్ అయ్యారు. ఆశా వర్కర్లు తమకు ఓటు వేయకపోతే ఉద్యోగం తీసేస్తామని అంటున్నారని, ఇదేం రౌడీయిజమని ప్రశ్నించారు.మరోవైపు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటించారు. సిద్దార్థ నగర్ బూత్-120 వద్ద భారీ కాన్వాయ్‌తో పర్యటించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఎలా సహకరిస్తారని పోలీసులపై మాగంటి సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు బోరబండలో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాగంటి సునీతను అడ్డుకున్న పోలీసులు, బలవంతంగా ఆమెను వెనక్కి పంపించారు. ఎమ్మెల్యే అభ్యర్థి అయితే ఏంటి అంటూ అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. బోరబండలో సీఐ కూడా కాంగ్రెస్ నాయకులకు సపోర్ట్ చేస్తున్నారన్నారు. తాము పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తుంటే పోలీసులు మమ్మల్ని వీడియోలు తీస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వాళ్లది కాబట్టి పోలీసులు వారికి సపోర్ట్ చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## బాంబు దాడి నిందితులను వదలబోం...



న్యూఢిల్లీ,నవంబర్11: దిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లో నూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు.

ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలిచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోడీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దు:ఖాన్ని అర్థం చేసుకున్నాం. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు సూత్రధారులను విడిచిపెట్టబోం. కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం. ఇప్పటికే ఉగ్ర కుట్ర మూలాలను గుర్తించాం. ఢిల్లీ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాం. పేలుడుపై అర్ధరాత్రి వరకు సమీక్షలు చేస్తూనే ఉన్నాం. బాధితుల వెంట దేశమంతా ఉందని మోడీ తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోడీ మంగళవారం ఉదయం భూటాన్ వెళ్లారు. పర్యటన ముగించుకుని బుధవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5:30 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## సంపాదకీయం

బుధవారం 12-11-2025

# ప్రభుత్వ సంక్షోభ హాస్టళ్లు !

సంక్షేమ హాస్టళ్లు సంక్షోభ హాస్టళ్లుగా మారుతున్నాయి. ఉమ్మడి ఏపిలో ఎలా ఉన్నాయో..ఇప్పుడు రాష్ట్రం రెండుగా విడిపోయాక కూడా వాటి స్వరూప స్వభావాలు మారలేదు. పిల్లల పేరు చెప్పి కొందరు పందికొక్కుల్లా బలుస్తున్నారు. వార్డెన్లు భయం లేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అన్నింటికి మించి సంక్షేమ హాస్టళ్లలో కాలం వెళ్లదీస్తున్న పిల్లల జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో తెలియడం లేదు. అమ్మాయిలైతే బలవంతపు అత్యాచారాలకు గురవుతున్నారు. ఇదో రకమైన హింస. ఇందులో బయటకు వచ్చే కేసులు కొన్ని మాత్రమే. ఇకపోతే సరైన ఆహారం ఉండదు. సరైన వసతి ఉండదు. నాసిరకం ఆహారంతో వాంతులు విరేచనాలతో ఆస్పత్రి పాలు కావడం, అందులో కొందరు మృత్యువాత పడడం... తలంబిందరులకు క్షోభ మిగల్చడం అన్నది భేతాళ కథల్లా సాగుతున్నాయి. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ హాస్టళ్ల అధ్వాన్నంగా ఉన్నాయి. హాస్టళ్లలో ఉండే పిల్లలను పురుగుల్లా చూస్తున్నారు. ఎలాంటి రక్షణ ఉండదు. తల్లిదండ్రులకు దూరంగా అక్కడ ఇంత తింటూ చదువుకుందామని వచ్చిన వారికి ఈసడింపులు షరామామూలే. పదేళ్లపాటు తెలంగాణను ఏలిన కల్వకుంట్ల కుటుంబం హాస్టళ్లను బాగుచేసివుంటే ఇవాళ జరుగుతున్న ఘోరాలు జరిగేవా అన్నది ఆలోచించాలి. కానీ వారు చేయలేదు. తమ కాలంలో జరిగిన అనర్థాలే ఇప్పుడు జరుగుతున్నాయి. వీటిపై గగ్గోలు పెట్టడం కెటిఆర్, హరీష్ రావులకు అలవాటయ్యింది. ఏపిలో కూడా ఇంతకుమించి ఘటనలు జరుగుతున్నాయి. ఘనత వహించిన చంద్రబాబు పాలనలో కూడా వాటి రూపురేఖలు ఏమీ మారడం లేదు. విద్య,వైద్యానికి పెద్దపీట వేయాల్సిన పాలకులు ఓట్ బ్యాంకు రాజకీయాలతో డబ్బు వృధా చేసే పథకాలను మోస్తున్నారు. ఇకపోతే అక్షరాస్యతలో బాగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలలో ప్రేమ ఒలకబోయడమే తప్ప నిజంగానే వారిని ఉద్ధరించే కార్యక్రమాలు శూన్యం. గిరిజన ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే లక్ష్యంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 46 గిరిజనులకు విద్య, రక్షణ, సదుపాయాలు కల్పించాలని పేర్కొంది.గిరిజనుల విద్య కోసం చేసిన కృషిని కూడా విస్మరించలేం. అయితే అది వారు స్వయంగా ఎదిగేలా చేయడం లేదన్నదే బాధ. ఈ క్రమంలో ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పి అక్షరాస్యత కోసం, విద్య కోసం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసినా వాటిని బలోపేతం చేయడంలో ఇరు రాష్ట్రాల్లో పాలకులు విఫలం అయ్యారు. గిరిజనులకు విద్యను అందిస్తూ వారిని అన్ని విధాలా సామాజిక వివక్షతల నుంచి, దోపిడీ నుంచి రక్షించాల్సి ఉంది. వారు చదువుసంధ్య లేక కేవలం గూడేలకు పరిమితం కాకుండా చూడాలి. షెడ్యూలు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాలను ప్రకటించింది. అయినా వారి గూడాలకు నేటికీ రోడ్డు లేదు. సరైన చదువు, వైద్యం లేదు. అనేక ప్రాంతాల్లో గిరిజన హాస్టళ్లు బాలారిష్టాలతోనే కొనసాగుతున్నాయని ఆయా ప్రాంతాలలో జరిగే సంఘటనలే నిరూపిస్తున్నాయి. నేటికీ గిరిజన ప్రాంతాల నుండి ఆసుపత్రికి రావాలంటే డోలీ మోతలు చూస్తున్నాము. ఆ ప్రాంత ప్రజలపైగల బాధ్యతా రాహిత్యం విద్యార్థులు చదువుకునే సంక్షేమ గృహాలపై కూడా కొనసాగుతున్నది. ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నప్పుడు తాగునీరు లేక, మరుగుదొడ్లు లేక రోగాల బారినపడి చనిపోయిన ఘటనలను చూశాం. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని కురుపాం మండల కేంద్రంలోగల గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన ఘటన వరకు రాష్ట్రాన్ని కుదిపివేశాయి. ఇద్దరు బాలికలు చనిపోవడం, 138 మంది పచ్చ కామెర్లతో ఆసుపత్రిపాలు కావడం సంక్షేమ హాస్టళ్ల పట్ల ప్రభుత్వం ఏ విధంగా శ్రద్ధ చూపుతున్నదో అర్థం అవుతున్నది. క్యాంటం కంప్యూటింగ్, ఏఐ అంటూ నిత్యం ప్లేట్ వేస్తున్న చంద్రబాబు ఈ హాస్టళ్ల దుస్థితి తెలుసుకోక పోవడం దురదృష్టకరం. తెలుగు రాష్ట్రాల్లోగిరిజన సంక్షేమ హాస్టళ్ల ఎక్కువ శాతం సౌకర్యాలు లేమితో కునారిల్లుతున్నాయి. బాలికల వసతి గృహాలు సరిపడినన్ని లేక అత్యంత దయనీయంగా వున్నాయి.. పాఠాలు బోధించడానికి, బాలికలు నిద్రించడానికి, సామానులు భద్రపరచడానికి, భోజనాలు చేయడానికి అన్నింటికీ ఒకటి రెండు గదులతో సరిపుచ్చుతున్నారు. చెప్పాలంటే గురుకులాలు సమస్యల నిలయాలుగా ఉన్నాయి. బాలికల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక్క ఆశ్రమ పాఠశాలలో కూడా ఏ.ఎన్.ఎం లు లేరు. గురుకులాలలో ఉన్నప్పటికీ తగిన మందులు, సౌకర్యాలు కల్పించడంలేదు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు భయపడి ఆందోళనతో స్వంత డబ్బులతో ఆరోగ్య కార్యకర్తలను నియమించుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. పాలకులు మారుతున్నా పరిస్థితులు మారడం లేదు. వార్డెన్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన లేనందున ఉపాధ్యాయులే ఒకవైపు బోధన మరోవైపు, పిల్లల బాధ్యత చూడటం జరుగుతోంది. వైద్యపరమైన సేవలు అందించడానికి సిబ్బంది లోపం కూడా విద్యార్థులకు శాపంగా మారుతున్నది. విద్యార్థుల అనారోగ్య పరిస్థితులలో మెడికల్ ఖర్చు భరించేందుకు తగిన నిధిని సమకూర్చడం లేదు. సంక్షేమ హాస్టళ్లలో చిన్నపిల్లల ఆలనా పాలన చూసే ఆయాలు గాని, టీచర్లు గాని ప్రత్యేకంగా లేకపోవడం వలన పిల్లల మానసిక, శారీరక, విద్యాపరమైన అంశాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నిజానికి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేసి గుణాత్మక విద్యను అందివ్వాలి. తద్వారా సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలి. బదులు లేక, ఉన్నాబడుల్లో టీచర్లు లేక, అసంపూర్ణ భవనాలు, చాలీచాలని వసతులు ఎక్కడికి వెళ్లినా దర్శనమిస్తున్నాయి. తాగునీటిది పెద్ద సమస్య, గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు రోగాల బారినపడి పిట్టల్లా రాలిపోవడం చూస్తున్నాం. విషజ్వరాలు, పచ్చకామెర్లు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ఈ రంగంపై నిర్లక్ష్యం తగదు. ఎప్పటికప్పుడు మౌలిక వసతులు కల్పించే విషయంలో బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా, మరమ్మతులు, వైద్య అవసరాలు, పోషక విలువలతో కూడిన మెనూ చార్జీల పెంపునకు నిధులు పెంచాలి. పేదరికం, దోపిడీ, వెనుకబాటుతనం నుండి విముక్తి జరగాలంటే హాస్టళ్లను బలోపేతం చేయాలి. పాఠశాలలకు ఆయా హాస్టళ్లను అటాచ్ చేయాలి. ప్రత్యేకించి నిధులు పెంచాలి. అప్పుడే పేదలకు విద్య అందుతుంది.

# బీహార్‌లో రాహుల్ ఓట్ చోరీ పనిచేసేనా?

పాట్నా:బీహార్ ఎన్నికలు ఓ రకంగా బిజెపికన్నా రాహుల్‌కే ప్రతిష్టాత్మకంగా భావించాలి. ఓట్ చోరీ పేరుతో మన ఎన్నికల వ్యవస్థను అప్రతిష్టపాలు చేసిన వ్యక్తిగా రాహుల్ చరిత్రలో నిలిచపోయారు. ఆయన మోడీ పాలన పై చేస్తున్న విమర్శలను సహేతుకంగా తీసుకోవచ్చు. కానీ ఓట్ చోరీ పేరుతో వ్యవస్థను బద్నాం చేస్తూ వచ్చారు. ఆయన అమెరికా వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో అంశం మీద రచ్చచేస్తూనే ఉన్నారు. పంజాబ్‌లో రైతులను రెచ్చగొడుతూనే వచ్చారు. అధికార లేమితో కాంగ్రెస్ నానాయాగీ చేస్తోందని చెప్పుకోవచ్చు. అలాగే తమ యూపిఎ పాలనలో అక్రమాలపై నోరు మెదపడం లేదు. బీహార్‌లో కాంగ్రెస్ ఎన్నటికీ విజయం సాధించే అవకాశం లేదు. బీహార్‌లో తొలిద ముగిసింది. రెండోదశ మంగళవారం ఎన్నికలు జరుగబోతు న్నాయి. ఈ క్రమంలో తమదే అధికారం అని చెబుతున్న రాహుల్, ఓడిపోతే ఓట్‌చోరీతో మరింత యాగీ చేయాలన్న బలమైన వ్యూహంతో ఉన్నారు. ఇకపోతే ఇప్పటికే 9సార్లు సిఎంగా గెలిచిన నితీశ్ కుమార్‌కు ఓ రకంగా ఇవి చివరి ఎన్నికలని భావించాలి. గెలిస్తే పదోసారి సిఎంగా ప్రమాణం చేస్తారా లేదా అన్నది చూడాలి. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను బాగా చూరగొన్నారు. మృదుభాషిగా పేరున్న నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్ ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ది పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పకతప్పదు. ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను ఎన్‌డిఎ పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించడం వెనక బీహార్ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించారని చెప్పకతప్పదు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరని ప్రధానమంత్రి గ్రహించారు. మరోమారు బీహార్‌లో ఎన్‌డిఎ విజయం సాధిస్తే.. సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనత పార్టీతో నితీశ్ జతకట్టంలో ఆయన స్వార్థం కూడా ఉంది. నిరంతరాయంగా బీహార్ సిఎంగా నిలిచిపోవాలన్న ఆయన కాంక్షను కాదనలేం. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. అలాగని బీజేపీకి నితీశ్ కుమార్ పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన



తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వయసు మీదపడడంతో నితీశ్ కుమార్ కూడా తప్పిని పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉంటూ వస్తున్నారు. అయితే మారుతున్న కలానుగుణంగా బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. తేజస్వి యాదవ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇకపోతే బీహార్ ఓటర్ల సవర్ణ రచ్చ కూడా చర్చకు దారితీస్తోంది. ఎంఐఎం కూడా ముస్లిం డామినేట్ ఉన్న ప్రాంతాల్లో బరిలోకి దిగింది. ఈ క్రమంలో బీహార్ ఎన్నికలు ఎవరికి మొగ్గు చూపుతాయి, ప్రజలు ఆలోచన ఏ విధంగా ఉందన్నది కూడా అంతుచిక్కడం లేదు. ఇప్పటికే బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు.ఇప్పటికి మొత్తం తొమ్మిది సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేం దుకు బీజేపీ ప్రయత్నించింది. నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజక వర్గాలలో జయపతాక నెగురవేసింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్ కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకు న్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువు నా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. అందుకే బిజెపిని తన దగ్గరే పెట్టుకుని జాగ్రత్తగా ఉంటున్నారు. అయితే ఈసారి ఆయన పదోసారి సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్నది చూడాలి. ఈక్రమంలో తేజస్వీ యాదవ్ సిఎం కావడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ఘట్‌బందన్ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి. అలాగే రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు ఏమేరకు ఫలితం ఇస్తుందో చూడాలి.

# పురుషాధిక్య రాజకీయాలతో విస్మరణకు గురైన మహిళలు..



పాట్నా:బీహార్ పొరుగు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్‌లో మాయావతి, బెంగాల్‌లో మమతా బెనర్జీ ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రతిపక్షాలు సైతం గౌరవించేలా బీహార్‌లో మహిళలు ముఖ్యమంత్రిగా ఎందుకు కాలేకపోయారు? బీహార్ రాజకీయాలు పితృస్వామ్యం, కులతత్త్వంతో అద్దబద్దాయి. అంతేకాదు, కులం ముసుగులో మహిళలకు సంబంధించిన అంశాలు విస్మరణకు గురైయ్యాయి.బీహార్ ఎన్నికలలో కులాధార భాగస్వామ్యం చాలా కీలకమైన అంశంగా ఉంది. ఏ కులానికి చెందిన నేత ఎవరనేది ప్రజలకు అవసరమైన విషయం. కానీ బీహార్ రాజకీయాలలో సగం జనాభా గల వారి భాగస్వామ్యమేది? వారి కోసం ఎటువంటి అంశాలు ప్రధానమైనవనే వాటి గురించి ఎవరికీ పట్టనేపట్టదు."నేను ఏ సముదాయ పురోగతినైనా, మహిళల భాగస్వామ్య పురోగతితో లెక్కిస్తాను''అని బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు.బీహార్‌లో పార్టీల మ్యానిఫెస్టో మహిళా రాజకీయ ప్రాతినిధ్యం వరకే పరిమితమవుతుంది. ఏ కుల వ్యక్తి ముఖ్యమంత్రి లేదా మంత్రి అవుతాడనేదే ఇక్కడ కీలక పోటీగా ఉంటుంది. ఇది సరైనది కూడా, ఎందుకంటే సమాజంలో తరతరాలుగా ఎవరైతే విస్మరణకు గురైయ్యారో వారికి అవకాశం లభించాలి. దీనివల్ల వాళ్లు సామాజికంగా మిగితావారితో సరిసమానమైన స్థాయికి చేరుకోగలరు. వారి రాజకీయ ప్రాతినిధ్యం నిర్ధారించుకోవాలి కాబట్టి ఇది సముచితమైనది.భాగస్వామ్యానికి ఇదే ఆధారమైతే, సమాజంలో మహిళలు అణిచివేతకు గురికాలేదా? వేల సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు పురుషాధిక్యాన్ని వారు ఎదుర్కోవడం లేదా?

25% మహిళలకు టికెట్ ఇవ్వని వైనం..

ఏ పార్టీ కూడా మహిళను సీఎం, డిప్యూటీ సీఎంగా ప్రకటించలేదు. బీహార్‌కు ఒకేఒక మహిళా ముఖ్యమంత్రిగా రాబడీ దేవి సేవలందించారు. కానీ తను ఏ సభలో లేదా ర్యాలీలో ప్రసంగించిన దాఖలాలూ లేవు. తన ఆలోచనలు ప్రజలకు తెలియనే తెలియదు. తను ప్రాతినిధ్యం వహించలేదనేది స్పష్టం.

స్వపక్షం లేదా విపక్ష సహాయంతో ఏదైనప్పటికీ, నితీష్ కుమార్ ఇప్పటి వరకు 9 సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రతీ ఒక పార్టీ కూటమితో బీహార్ కోసం తను పనిచేశారు. తన గత 5 పదవీకాలాలను చూసుకున్నట్లైతే 2 సార్లు కాంగ్రెస్–ఆర్జేడీ కూటమితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మూడుసార్లు ఎన్డీఏతో, అందులో నుంచి ఒక పదవీకాలం ప్రస్తుతం నడుస్తోంది.ఈ ఐదు పదవీకాలాలలో మంత్రిమండలిలో మహిళా భాగస్వామ్యాన్ని చూసినట్లయితే, ప్రతీ పదవీకాలంలో ఎక్కువలో ఎక్కువ ముగ్గురు మహిళలు మాత్రమే మంత్రులయ్యారు. దీనికి విరుద్ధంగా ప్రతీసారి 30 నుంచి ఎక్కువ మంత్రిత్వశాఖలను పురుషులకు ఇచ్చారు.అయినప్పటికీ, 2020లో నితీష్ కుమార్ 7వ పదవీకాలంలో దేశ స్వాతంత్ర్యం తర్వాతబీ బీహార్‌కు మొదటిసారి మహిళా ఉపముఖ్యమంత్రి రేణుదేవీ లభించారు. కానీ తన పదవీకాలం 2022 ఎన్డీయేతో జేడీయూ కూటమి తెగదెంపులతో ముగిసిపోయింది.2020 అసెంబ్లీ ఎన్నికల్లో 243 సీట్లలో నుంచి ఎన్డీఏ దాదాపు మహిళలకు 35 టికెట్‌లను కేటాయించింది. మహాకూటమి దాదాపు 25 మహిళా అభ్యర్థులను మైదానంలో దించింది.ప్రస్తుతం బీహార్ అసెంబ్లీలో 243 సీట్లలో 26 మహిళా ఎమ్మెల్యేలు ఉన్నారు. 2015లో కూడా అటూఇటుగా ఇదే పరిస్థితి నెలకొంది. కేవలం 28 మహిళా ఎమ్మెల్యేలను ఎన్నుకున్నారు. శాసనమండలి గురించి మాట్లాడితే, ప్రస్తుతం 75లో కేవలం 10 మంది మహిళా ఎమ్మెల్సీలున్నారు.ఈ గణంకాలు కేవలం రాష్ట్ర ఎన్నికల వరకు మాత్రమే పరిమితం కాలేదు. బీహార్‌లో 40 లోక్సభ సీట్లు ఉన్నాయి– 2024 లోక్సభ ఎన్నికలో ఎన్డీఏ బీహార్‌లో 4, ఇండియా కూటమి 6 మహిళా అభ్యర్థులకు టికెట్ కేటాయించింది. అందులో నుంచి 5మంది మాత్రమే ఎన్నికల్లో విజయబావుటా ఎగరేశారు. ప్రస్తుతం ఎంపీలుగా కొనసాగుతున్నారు.దీనికంటే ముందు 2019లో కూడా కేవలం ముగ్గురు, 2014లో ఇద్దరు మహిళలు ఎంపీలుగా ఎన్నుకోబడ్డారు. 1996లో గయా నుంచి భగవతీ దేవీ ఎన్నుకోబడ్డారు. ఈరోజు తన లోక్సభ ప్రసంగాల వీడియోలు ఎక్కువగా వైరల్ అవుతున్నాయి.

రాజకీయ కుటుంబాలతో ముడిపడిన మహిళలు..

అయినప్పటికీ, భగవతీ దేవిలాంటి మహిళల స్వరం ప్రస్తుతం తగ్గుతోంది. వాళ్లు తమ స్వంతబలం మీద రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాకుండా, అణివేతకు గురవుతున్న పార్లమెంట్‌లో బాధితుల హక్కుల గురించి మాట్లాడారు. అయితే ఏ మహిళ అభ్యర్థిగా ఎన్నికలలో దిగుతారో, వారు మందు నుంచే రాజకీయ కుటుంబానికి చెందినవారై ఉంటారు. దీనికి ఒక పెద్ద ఉదాహరణగా ప్రస్తుతం బీహార్‌లో ఎంపీలైన 5మంది మహిళలు కనబడతారు.బీహార్ ప్రభుత్వంలో మంత్రి అశోక్ చౌధరి కూతురు– సమస్తీపూర్ ఎంపీ శాంభవీ చౌధరి. ఎంపీ మీసా భారతీ తను లాలూ యాదవ్ కూతురు. మిగితా ముగ్గురు ఎంపీలు కూడా కుటుంబ రాజకీయాలతో గాఢమైన సంబంధాలున్నాయి. పేద–మధ్యతరగతి మహిళలు రాజకీయాలలో భాగస్వామ్యం కావడం లేదని దీంతో స్పష్టమవుతుంది. ఏ మహిళలైతే ఎన్నికలలో గెలుస్తున్నారో, వారి వెనుక తండ్రి లేదా భర్త ఉన్నారు. ఇదంతా పరిశీలిస్తే దీని వెనుక కూడా పురుషాధిక్యత కనబడుతుంది.వస్తున్న 80% మహిళా అభ్యర్థులు– బాధితులలో నుంచి రావడం లేదని స్పష్టమవుతుంది. దీంతో కుటుంబ రాజకీయాలు, పెట్టుబడీదారీ, పితృస్వామ్యం బీహార్ రాజకీయాలను కబళిస్తున్నాయని అర్థమవుతోంది.2020లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికలలో మహిళల ఓటు శాతం 59.7గా ఉంది. ఇది పురుషుల కంటే కూడా ఎక్కువ. ప్రభుత్వం ఏర్పాటులో అన్నిటి కంటే ఎక్కువగా మహిళల భాగస్వామ్యం ఉందని ఈ గణంకాలు తెలుపుతున్నాయి. కానీ అన్ని పార్టీలూ కూడా కళ్లు మూసుకున్నాయి.2025 ఎన్నికలలో ఆర్జేడీ 143 నుంచి కేవలం 24 సీట్లుబీ అదే బీజేపీ– జేడీయూ కూటమి 202 సీట్లలో 26 సీట్లుబీ కాంగ్రెస్ 61లో 5 సీట్లుబీ జన్ సూరజ్ పార్టీ 243 సీట్లలో కేవలం 40 సీట్లను మహిళలకు కేటాయించి, ఎన్నికల బరిలో దించింది. సగం జనాభాకు ఏ పార్టీ కూడా 25% సీట్లను కేటాయించలేదు.బీహార్ రాజకీయ వ్యవస్థ పూర్తిగా పురుషుల చేతిలో ఉందని, సగం జనాభాను తమ ఓటు బ్యాంకు కంటే ఎక్కువగా భావించడంలేదని అర్థమవుతుంది. పరిస్థితి కూడా సరిగ్గా అలానే ఉంది.ఇద్దరు మహిళలకు ముఖ్యమంత్రులుగా బీహార్ రెండు పొరుగు రాష్ట్రాలు పట్టంకట్టాయి. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి, బెంగాల్‌లో మమతా బెనర్జీ. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. అయినప్పటికీ రాజకీయ కౌశల్యాన్ని చూసి ఇతర పార్టీలు భయపడేలా, ప్రతిపక్షాలు గౌరవించేలా ఒక్క మహిళ కూడా బీహార్‌కు ముఖ్యమంత్రిగా ఎందుకు కాలేకపోయింది?

# భక్తులతో కిటకిటలాడిన శైవాలయాలు

అమరావతి,కార్తీక మాసం మూడో సోమవారంతో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటాడాయి. శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసంలో ఆ మహాదేవుడుని భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు. కార్తీక మాసం ఎంతో పవిత్రమైనది, విశిష్టమైనది అని పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాసంలో భక్తులు నదుల్లో పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నదుల్లో వదులుతుంటారు. శైవక్షేత్రాల్లో శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహి స్తుంటారు. హర హర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణతో ఆలయాలు మార్మోగుతుంటాయి. ఇక కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఏపీలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పంచారామ క్షేత్రం, ద్రాక్షరామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం, పాదగయా క్షేత్రం, శ్రీశైలం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరుడిని దర్శించుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని క్షీరా రామలింగేశ్వర స్వామి వారి పంచారామ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పవిత్ర కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. విశాఖపట్నంలో కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు క్యూకట్టారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పంచాక్షరీనామంతో ఆలయంలో మార్మోగింది. తెల్లవారుజామున నుంచే భక్తులు సప్త గోదావరిలో స్నానమాచరించి శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఽాజమండ్రిలో కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి.. కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శైవ క్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం పాదగయ పుణ్యక్షేత్రంలో పెద్ద ఎత్తున కార్తీకమాస పూజలు నిర్వహించారు. కార్తీక మాసం మూడవ సోమవారం కావడంతో అరటి డొప్పలపై కార్తీక దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదులుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు చేస్తున్నారు. రాజరాజేశ్వరి సమేత ఉమాకుక్కుటేశ్వర స్వామి వారిని, పదవ శక్తిపీఠం పురుహూతికా దేవి అమ్మవార్లను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలంలో భక్తులు కార్తీకమాసం పూజలు నిర్వహించారు. మూడవ సోమవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. దీంతో స్వామి వారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. వేకువజామున నుంచే పాతాళగంగలో భక్తులు పుణ్యస్నాలు ఆచరించి గంగమ్మ ఒడిలో కార్తీక దీపాలను వదులుతూ మొక్కులు తీర్చుకుంటున్నారు. క్యూ కంపార్టుమెంట్‌లలో వేచి ఉన్న భక్తులకు శివసేవకులు పులిహోర, బిస్కెట్లు మంచినీటిని పంపిణీ చేస్తున్నారు. గంగాధర మండపం వద్ద మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

# రోజుకో కోటి ...

హైదరాబాద్,టెక్నాలజీ పెరుగుతోంది అని మురిసిపోతున్నారు ఆ వెంటనే వచ్చే అనర్థాలు కూడా కొంప ముంచుతున్నాయి. బ్యాంకులకు వెళ్ళి క్యూలో నిలబడి సొమ్ములు తీసుకోవడం ఒక నాటి బాధ. అది తప్పింది, హాయిగా మన ఫోన్ లోనే స్మార్ట్ గా డబ్బులు జస్ట్ సెకన్ వ్యవధిలో ఎదుటి ఖాతాలో వేసి ఖర్చు పెట్టొచ్చు, ఎవరికైనా ఇవ్వొచ్చు. ఇదంతా బాగానే ఉన్నా దీని వెనకనే సైబర్ భూతం కూడా పొంచి ఉంది. ఈ లావాదేవీల వెనకనే పొంచి చూస్తూ వల పన్ని మరీ ఖాతాను కబ్జా చేస్తోంది. సైబర్ నేరగాళ్ళు కొత్త ఎత్తులు వేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. దాంతో ఖాతాలో సొమ్ము అలా జారిపోతూంటే లబోదిబో అనాల్సి వస్తోంది అమాయకులు.

ఓల్డ్ పీపుల్ టార్గెట్ :

ఎక్కువగా వృద్ధులు టార్గెట్ గా సైబర్ నేరగాళ్ళు రెచ్చిపోతున్నారు. ఎంతో ఘనమైన పదవులు నిర్వహించి రిటైర్ అయిన వృద్ధులకు ప్రభుత్వ పెన్షన్ వస్తుంది. అలాగే బిడ్డలు విదేశాల్లో ఉంటూ పంపించే లక్షల సొమ్ము జమ అవుతోంది. దానినే దృష్టిలో ఉంచుకుని సైబర్ గాళ్ళు టోకరా వేస్తున్నారు.

డేటాతో సహా :

సైబర్ నేరగాళ్ళు ఒక డేటాను దగ్గర పెట్టుకుని మరీ నేరాలకు పాల్పడుతున్నారు. టార్గెటెడ్ బాధితులను ముందే సిద్ధం చేసుకుంటున్నారు. అలా వారి డేటాలో చూస్తే కనుక వ్యక్తుల సంపద, వయసు, చిరునామా వంటి వివరాలు ఉంటున్నాయి. వాటిని వారు చలా ఈజీగా సేకరిస్తున్నారు. ఆ మీదట టార్గెటెడ్ పర్సన్స్ ని ఎంచుకుని మరీ ఫోన్ కాల్స్ చేయడం, సోషల్ మీడియా ద్వారా వారితో పరిచయం పెంచుకుని సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఇక ఒంటరిగా ఉండే మహిళలు వీరి ప్రధాన టార్గెట్ అయితే ఆ తరువాత వరసలో వృద్ధులు ఇళ్ళలో ఉండే గృహిణులు ఉంటున్నారు. వీరినే టార్గెట్ గా పెట్టుకుని వారిని బెదిరించి మరీ ఖాతాను ఖాళీ చేస్తున్నారు

సవాల్ గా మారింది :

నేరాలు ఒకపుడు ఫిజికల్ గా ఉండేవి, ఇపుడు కంటికి కనిపించకుండా జరిగిపోతున్నాయి. టెక్నాలజీ తో సవాల్ గా మారిన ఈ సైబర్ నేరాలను అతి తీవ్రమైన సామాజిక సమస్యగా పోలీసులు పేర్కొంటున్నారు. ఈ విధంగా రోజుకు వచ్చే ఫిర్యాదులు అధికం అవుతున్నాయి. దాంతో ఒక్క హైదరాబాద్ లాంటి నగరంలోనే రోజుకు కోటి రూపాయలు దాకా సైబర్ నేరగాళ్ళు కొల్లగొడుతున్నారు అని పోలీసులు చెబుతున్నారు.

# మండిపడ్డ సౌతాఫ్రికా ప్రభుత్వం

వాషింగ్టన్, దక్షిణాఫ్రికాలో నిర్వహించనున్న జీ20 సదస్సును బహిష్కరిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం సంచలనంగా మారింది. అమెరికా తరఫున ఒక్క అధికారి కూడా జీ20 సదస్సుకు హాజరు కాబోరని ట్రంప్ ప్రకటించడంపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం మండిపడింది. ట్రంప్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో చేసిన విమర్శలపై దక్షిణాఫ్రికా ప్రభుత్వం, పాలక పార్టీ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'అమెరికా నాయకులు చేసిన ప్రకటనలు పూర్తిగా అవాస్తవాలు. వారిది సామ్రాజ్యవాద జోక్యం. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష లేదు. వర్ణవివక్ష సృష్టించిన అసమతుల్యతలను పరిష్కరించడానికే దక్షిణాఫ్రికా చట్టాలు పని చేస్తాయి. సామ్రాజ్యవాద సరసాలను మేము సరదాగా తీసుకోము. అమెరికా పాల్గొనకపోయినా సమ్మిట్ కొనసాగుతుంది. ట్రంప్ వాదనలు, కట్టుకథలను మేము తిరస్కరిస్తున్నాము. మా సార్వభౌమాధికారం పట్ల ట్రంప్ యంత్రాంగానికి ఎలాంటి గౌరవమూ లేదు. వారు మమ్మల్ని అమెరికా ఉపదేశం అని భావిస్తున్నారు' అంటూ ఏఎన్సీ సెక్రటరీ జనరల్ ఫికిలే ముబాలులా విమర్శించారు. క్షిణాఫ్రికా ప్రభుత్వం శ్వేత జాతి రైతులతో క్రూరంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ట్రంప్ జీ20 శిఖరాగ్ర సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు .

# షట్‌డౌన్ నుంచి బయటపడే దశలో అమెరికా

వాషింగ్టన్, అమెరికాలో నెలకొన్న ప్రభుత్వ షట్‌డౌన్ మేఘాలు వీడిపోనున్నాయి. దీనికి అనుకూలంగా ఆ దేశ సెనెట్ ఓటింగ్ జరిగింది. కొందరు డెమోక్రాట్లు కూడా అనుకూలంగా ఓటు వేయడంతో 40 రోజుల పాటు నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. అమెరికా ప్రభుత్వానికి నిధు విడుదలకు సంబంధించిన బిల్లులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కాంగ్రెస్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మొదలైన షట్‌డౌన్ ఆదివారం నాటికి 40వ రోజుకు చేరుకుంది. దేశవ్యాప్తంగా విమాన సేవలకు అంతరాయం కలగడంతో ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి సెనెటర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షట్‌డౌన్ ముగించే దిశగా తొలిఅడుగు పడింది. ట్రంప్, రిపబ్లికన్లు ప్రతిపాదించిన ఓ డీల్‌కు కొందరు డెమోక్రాట్లు సానుకూలంగా స్పందించారు. చివరి నిమిషంలో టెక్సాస్ సెనెటర్ జాన్ కార్నిన్ ఓటుతో తీర్మానానికి అనుకూలంగా 60 ఓట్లు వచ్చాయి. సెనెట్‌లో రిపబ్లికన్ సభ్యుల సంఖ్య 53 కాగా.. డెమోక్రాట్ల సంఖ్య 45, ఇద్దరు స్వతంత్రులు ఉన్నారు. అక్కడ బిల్లు ఆమోదం పొందాలంటే 60 ఓట్లు రావాలి. ఇప్పుడు కనీసం ఎనిమిది మంది డెమోక్రాట్లు మద్దతు ఇచ్చారు.అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. 1981 నుంచి అక్కడి ప్రభుత్వం 15 సార్లు మూతపడింది. 2018-19 మధ్య దాదాపు 35 రోజులపాటు మూతపడగా.. అప్పటికి అదే సుదీర్ఘ షట్‌డౌన్. ట్రంప్ హయాంలో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడం ఇది మూడోసారి. ఇప్పుడు తాజా షట్‌డౌన్‌కు తెరపడే దిశగా అడుగులు పడ్డాయి.

# కేరళలో కూలిన వాటర్ ట్యాంకర్

కొచ్చి, కేరళ వాటర్ అథారిటీ ఫీడర్ ట్యాంక్ సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పలు ఇళ్లలోకి నీరు చేరింది. నీటి తాకిడికి పలు ఇళ్లు కూలిపోయాయి. దీంతో అనేక ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఈ హఠాత్ పరిణామంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నీరు ఉద్ధృతంగా రావడంతో పలు ఇళ్ల పైభాగాలు కూలిపోయాయని.. అనేక వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయని అధికారులు పేర్కొన్నారు. కేరళలోని తమ్మనం అనే ప్రాంతంలో ఉన్న కేడబ్ల్యూఏ నీటి ట్యాంక్ కూలడంతో 1.38 కోట్ల లీటర్ల నీరు ఒక్కసారిగా జనావాసాలపై గుమ్మరించినట్లు పడిపోయింది. తెల్లవారుజామున 2 గంటలకు కేడబ్ల్యూఏ ఫీడర్ పంప్ హౌస్‌లోని వాటర్ ట్యాంక్‌లో కొంత భాగం కూలిపోవడం తో ఈ సంఘటన జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న ఇళ్లల్లోకి భారీగా నీరు చేరడంతో అనేక ఎలక్ట్రిక్ పరికరాలు, ఫర్నిచర్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సమీపంలోని ఆరోగ్య కేంద్రంలోకి నీరు చేరడంతో పెద్ద మొత్తంలో మందులు, వైద్య పరికరాలు పాడైనట్లు అధికారులు తెలిపారు. ఈ ట్యాంక్‌ను 50 ఏళ్ల క్రితం నిర్మించారని.. దీనినుంచి కొచ్చి, త్రిపునితుర ప్రాంతాలకు నీరు సరఫరా అవుతుందని ఎర్నాకుళం ఎమ్మెల్యే వినోద్ వెల్లడించారు. వరద వల్ల ప్రభావితమైన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని కేడబ్ల్యూఏను కోరారు. కొచ్చి, ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు కేడబ్ల్యూఏ అధికారులు తెలిపారు.

# ప్రకంపనలు...

పాట్నా:బీహార్ ఒక పెద్ద రాష్ట్రం. హిందీ బెల్ట్ లో అతి కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక రాజకీయంగా మార్పు వస్తే అది జాతీయ స్థాయిలోనే బిగ్ సౌండ్ చేస్తుంది. బీహార్ మీద అందుకే అందరూ ఫుల్ ఫోకస్ పెట్టేశారు. బీహార్ మహా ఘట్ బంధన్ ని గెలిపించడండి. ఈ ఒక్క ఓటుతో జాతీయ స్థాయిలో రాజకీయం కూడా మారుతుంది అని కాంగ్రెస్ నేతలు చాలా కాలంగా ప్రచారం చేస్తూ వస్తున్నారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి. బీహార్ కి డైరెక్ట్ గానే కేంద్ర రాజకీయాలతో సంబంధం ఉంది. దాని పేరే జేడీయూ, దాని అధినేత ప్రస్తుత సీఎం నితీష్ కుమార్ కూడా చాలా ముఖ్య పాత్ర పోషిస్తున్నారు.

నితీష్ ఓడితే :

బీహార్ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న రానున్నాయి. ఈ ఫలితాలు కనుక మహా ఘట్ బంధన్ కి అనుకూలంగా వస్తే మాత్రం జాతీయ స్థాయిలో అతి పెద్ద సంచలనమే అవుతుంది అని అంటున్నారు. నితీష్ కుమార్ ఓటమి చెంది మాజీ సీఎం అయితే మాత్రం అది ఒక్కలా ఉండదని అంటున్నారు. ఆయన గత రెండు దశాబ్దాలుగా ఖాళీగా అయితే లేరు. ఆయన కూటములు మార్చి మార్చి సీఎం పదవిలో అలా రెండు దశాబ్దాల పాటు కొనసాగారు. ఇపుడు ఆయన కనుక ఒక్కసారి మాజీ సీఎం అనిపించుకుంటే అపుడు ఎలా అన్నది ఒక చర్చ.

చెన్నారెడ్డి పోలిక :

నితీష్ కుమార్ కి ఇక్కడ ఉమ్మడి ఏపీ సీఎం మర్రి చెన్నారెడ్డితో ఒక పోలిక కూడా పెడుతున్నారు విశ్లేషకులు. చెన్నారెడ్డిని ఎపుడూ కాంగ్రెస్ ఖాళీగా ఉంచలేదు, ఏదో ఒక పదవిని ఇస్తూ ఆయనను అలా అధికార కేంద్రంగానే చేస్తూ వచ్చింది. ఆయన కనుక ఖాళీగా ఉంటే పన్నే వ్యూహాలు ఏకంగా కొంప ముంచేస్తాయి అన్నది కాంగ్రెస్ ఆనాటి పెద్దల నమ్మకం. అదే నిజం కూడా. ఇపుడు నితీష్ కుమార్ కూడా అలాంటి స్టామినా ఉన్న వారే అని అంటున్నారు. ఆయన ఓటమిని ఓర్వలేరు అని అంటున్నారు. ఆయన మాజీ అయితే తరువాత పరిణామాలు ఎలా ఉంటాయో అన్న చర్చ సైతం సాగుతోంది.

ఎన్డీయే సర్కార్ కి కుదుపు :

కేంద్రంలో ఎన్డీయే సర్కార్ కి రెండు కీలక పార్టీల మద్దతు అందుతోంది. ఏపీ నుంచి టీడీపీ పదహారు ఎంపీ సీట్లు బీహార్ నుంచి నితీష్ కుమార్ కి చెందిన జేడీయూ ఎంపీలు 12 మంది కొమ్ము కాస్తున్నారు ఇందులో నితీష్ కుమార్ ఇండియా కూటమి వైపు టర్న్ తీసుకుంటారా అన్న చర్చ సైతం సాగుతోంది ప్రస్తుతానికి అది ఎంతో ఊహాజనితమైన ఆలోచన అయినప్పటికీ రాజకీయాల్లో ఏదీ జరగదు అన్నది ఏమీ లేదు దాంతో కనుక చూస్తే బీహార్ లో ఓటమి తరువాత నితీష్ కుమార్ ఎత్తుగడలు ఏ విధంగా ఉంటాయి అన్నది కమలనాథులు సైతం అంచనా వేస్తున్నారా లేదా అన్నది ఒక డౌట్.

అదే కనుక జరిగితే :

బీహార్ లో ఓటమి తరువాత నితీష్ కుమార్ ను కేంద్రానికి తీసుకుని రావాలి. కేంద్రంలో ఆయనకు కీలక శాఖలు ఇస్తూ ఉప ప్రధానిగా చేయాలన్న డిమాండ్ ఏమైనా పెడతారా అన్నది కూడా ప్రచారంలో ఉన్న మాట. దానికి బీజేపీ పెద్దలు అంగీకరిస్తారా అన్నది మరో సందేహంగా ఉంది అన్నది సైతం ప్రచారం. అలా కాకుండా నితీష్ ని మాజీ సీఎం గా అలా ఉంచితే అది అటు ఇటూ తిరిగి ఏకంగా ఎన్డీయే సర్కార్ కే ఎసరు తెస్తుందా అన్నది మరో చర్చ. అలా జరగాలనే కాంగ్రెస్ బలంగా కోరుకుంటోంది అని అంటున్నారు ఇండియా కూటమి ఆలోచనలు అలాగే సాగుతున్నాయి. అయితే కేంద్రంలో ప్రభుత్వం మాత్రం తుమ్మితే ఊడే ముక్కు అయితే కాదు, బలమైన ప్రధానిగా మోడీ ఉన్నారు. ఇక నితీష్ కుమార్ ఎన్డీయేలోనే కొనసాగేలా చూస్తారు.

# బీఆర్ఎస్ లో అగ్గి రాజుకుందా ?

హైదరాబాద్,ఆయన ఏం మాట్లాడినా సంచలనమే, ఏం చేసిన అది హాట్ టాపిక్ గా మారిపోవటం ఖాయం అలాంటి నేత మరోసారి వార్తలో నిలిచారు ఈసారి సొంతపార్టీ జిల్లా అధ్యక్షుడి పై విరుచుకుపడ్డారు ఆయన ఎవరో కాదు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు . జిల్లా అధ్యక్షుడిని తాటి వెంకటేశ్వర్లు ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? అసలు తాటి వెంకటేశ్వర్లు పార్టీలో కొనసాగాలనే భావిస్తున్నారా! లేక పార్టీ మారే ఉద్దేశ్యంతో ఉన్నారా? ఎందుకు తాటి వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షుడిపై ఇంత కోపంగా ఉన్నారు? జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు ఎందుకు పార్టీలో తాటి వెంకటేశ్వర్లు ఎదుగుదలను అడ్డుకుంటున్నారు?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్యపోరు:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కు మరో నేత మెచ్చా నాగేశ్వరరావు , జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావుతో అస్సలు పొగడటం లేదు. ఆ క్రమంలో ఇక తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధం అవుతున్నారు తాటి వెంకటేశ్వర్లు. ఇందుకు స్థానిక ఎన్నికలే సరైన సమయంగా భావిస్తూ, తన అనుచరులతో కలిసి త్వరలో ఓ సమావేశాన్ని ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. దీనితో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో ఏంటీ రచ్చ అని తలలు పట్టుకుంటున్నారు.




అశ్వారావుపేటలో ఒక్కసారి కూడా గెలవని గులాబీ పార్టీ:

ఇక పార్టీ విషయానికొస్తే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఇప్పటివరకు 3 సార్లు ఎన్నికలు జరగగా ఒక్కసారి కూడా అశ్వారావుపేట నియోజకవర్గంలో గులాబీ పార్టీ గెలిచింది లేదు. పార్టీ అధికారం చేపట్టిన అనంతరం ఎమ్మెల్యేలుగా గెలిచిన ఇతర పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరటమే తప్ప ఈ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పెద్దగా ప్రభావం చూపింది లేదు. అధికారం పోవడంతో ఆ పార్టీలో చేరేవారు కరువయ్యారు. ప్రస్తుతం మిగిలిన ఒకరిద్దరు నాయకులను కూడా కాపాడుకోవటంలో కూడా రాష్ట్ర నాయకత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు నేరుగా విమర్శిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు కొరకరాని కొయ్యగా మారిన తాటి వెంకటేశ్వర్లు:

అశ్వారావుపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు బిఆర్ఎస్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారారు అనే చెప్పుకోవాలి. అటు బిఆర్ఎస్ పార్టీకి నిర్మాణాత్మక సూచనలు చేస్తూనే జిల్లా అధ్యక్షుడు ,రాష్ట్ర నాయకత్వంపై విమర్శలు గుప్పిస్తు అటు పార్టీని ఇటు కేడర్ ను ఇరకాటంలో పెడుతున్నారు. అటు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు మాత్రం తాను కేసీఆర్ కు వీరవిధేయుడినని, అశ్వారావుపేట నియోజకవర్గ ఇంచార్జి పదవి తనదేనంటూ , వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ అసెంబ్లీ టిక్కెట్ కూడా తనదే అన్నట్టు తనపని తాను చేసుకుపోతున్నరు. ఇప్పుడు అదే ఇద్దరి మధ్య వివాదానికి దారి తీసింది.

జిల్లా అధ్యక్షుడు , రాష్ట్ర నాయకత్వంపై విమర్శలు:

మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పార్టీ ముఖ్యనాయకులను కలుపుకుపోకుండా తన ఒకరిద్దరు అనుచరులు , జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో కలిసి ఓ ఫాం హౌస్ లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. దీనితో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లకు బాగా మండిందంట. తాటి వెంకటేశ్వర్లు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ ఫైర్ అయ్యారు. మెచ్చా నాగేశ్వరావు తోటలో జిల్లా అధ్యక్షుడు మీటింగ్ పెట్టటం ఇదేమీ మొదటిసారి కాదు గతంలో కూడా పెట్టారు అప్పుడు కూడా మాజీ ఎమ్మెల్యే ఇదేవిధంగా రియాక్ట్ అయ్యారు. తోట రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా , ట్రైకార్ చైర్మన్, 30 ఏళ్ల సుదీర్ఘమైన తన అనుభవాన్ని ఉపయోగించుకోవడంలో కానీ, ప్రజా సమస్యలపై పోరాటం , పార్టీని బలపరచడంలో కానీ బీఆర్ఎస్ జిల్లా నాయకత్వం పూర్తిగా విఫలం అయిందని తాటి వెంకటేశ్వర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

తిరుగుబాటుకు సిద్దమైన తాటి వెంకటేశ్వర్లు:

గత ఎన్నికల్లో పార్టీ ఓటమి అనంతరం ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కలిసి పనిచేసిన దాఖలాలు ఎక్కడా లేవు. అటు పార్టీ కార్యక్రమాలలో తాటి వెంకటేశ్వర్లకు పెద్దగా ప్రాధాన్యత దక్కకపోవడంతో తాటి వెంకటేశ్వర్లకు ఒంటరిగానే నియోజకవర్గంలో అడపదడప పర్యటిస్తూ తన ఉనికిని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు గ్రామీణ పార్టీ ఉనికి చాటుకునే కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలు సమయం ఆసన్న మవటంతో తాటి వెంకటేశ్వర్లకు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం తాటి వెంకటేశ్వర్లు స్వయంగా బిఆర్ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థులుగా తన అనుచరులను నియోజకవర్గం అంతటా అన్ని స్థానాలలో బరిలో నిలుపుతానని హెచ్చరిస్తున్నారు. జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు ఇద్దరి ఒంటెద్దు పోకడల కారణంగా పార్టీ గ్రామీణస్థాయిలో ఎదగటం లేదని, మెచ్చా నాగేశ్వరరావును అశ్వారావుపేట అసెంబ్లీ స్థానానికి ఇంచార్జి గా ఎవరు నియమించారని ప్రశ్నిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సైతం పట్టించుకునే పరిస్థితి కనిపించటం లేదన్నారు.

రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు పై విమర్శలు:

గత ఎన్నికల సమయంలో కేసీఆర్, హరీష్ రావు పిలిచి పార్టీలో సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తామని చెప్పి, స్వయంగా కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానిస్తే పార్టీలో చేరటం జరిగిందని తాటి వెంకటేశ్వర్లు అంటున్నారు. అదే సమయంలో కేసీఆర్ తనకు సూచించిన విధంగా మెచ్చా నాగేశ్వరావు గెలుపుకోసం చిత్తశుద్ధితో పనిచేశానని గుర్తుచేస్తున్నారు. పార్టీ ఓటమి చెంది రెండేళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఓటమికి గల కారణాలు విశ్లేషించుకోక పోవటం సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసుకోకపోవటం దురదృష్టకరం అన్నారు. ఇదే విషయాన్ని కేటీఆర్ , హరీష్ రావు , ఉమ్మడి ఖమ్మం ముఖ్య నేతల దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోకపోవటం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడుగా తన దగ్గరకు అనేక ఇబ్బందులతో వచ్చే కార్యకర్తలకు అండగా ఉంటూ మండల , జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడుతూ కార్యకర్తలను అనుచరులను కాపాడుకుంటున్నానని తాటి వెంకటేశ్వర్లు అంటున్నారు.. జిల్లా అంతటా పార్టీ కార్యకర్తల పరిస్థితి ఇలానే ఉందన్నారు దీనికి ముఖ్య కారణం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు , మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు అని విమర్శలు గుప్పిస్తున్నారు.

తననుండి ఇబ్బందులు ఎదుర్కోక తప్పదంటున్న తాటి:

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే ధోరణి కొనసాగితే తననుండి ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని అన్ని మండలాలో తన అనుచరులు పోటీలోకి రంగంలోకి దిగుతారని హెచ్చరికలు జారీచేస్తున్నారు.. మెచ్చా నాగేశ్వరావు కు తనకంటే ఏం గొప్ప అని తానైన జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు అయిన మరోపార్టీ నుండి గెలిచి వచ్చిన వాళ్ళమే అన్నారు. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు కొంత అభద్రతాభావంలో ఉన్నట్లు పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. తాటి వెంకటేశ్వర్లు లాంటి వ్యక్తికి అవకాశాలు దక్కితే తన జిల్లా అధ్యక్ష పదవికి చెక్ పడుతుందనే భ్రమలో జిల్లా అధ్యక్షుడు ఉండి ఉండొచ్చు అంటున్నారు.కానీ తన మనస్సులో అలాంటి ఆలోచన లేదన్నట్లుగా తాటి మాట్లాడారు. పార్టీలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు ఉండటం సాధారణమే కానీ ఎన్నికల సమయంలో సమష్టిగా కలిసి పనిచేస్తూ పార్టీని బలపరచాల్సినప్పుడు ఇలా తోటల్లో , గుట్టు చప్పుడు కాకుండా సమావేశాలు ఏర్పాటుచేయటం సమావేశాలకు జిల్లా అధ్యక్షుడు వచ్చి అటునుండి అటే పోవటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదే అభిప్రాయాన్ని కార్యకర్తలు సైతం కూడా వ్యక్తం చేయటం విశేషం. నియోజకవర్గ సమస్యలపై అవగాహన లేని వ్యక్తి కార్యకర్తలకు భరోసా కల్పించలేని వ్యక్తి మెచ్చా నాగేశ్వరావు లాంటి వ్యక్తి చేతిలో బాధ్యతలు పెడితే, పార్టీని బలపరచటం పార్టీ కార్యకర్తలను కాపాడుకోవటం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకత్వం పై విమర్శలు:

గతంలో కూడా తాటి వెంకటేశ్వర్లు ఇదే రకమైన వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ సమయంలో ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో తనకు రాజకీయ జన్మని ఇచ్చిన తెలుగుదేశం పార్టీలో చేరతారని, ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అధినేత ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలిసినట్టు, ఇక ఆ పార్టీలో చేరి పార్టీని ముందుండి నడిపిస్తారనే చర్చా నియోజకవర్గంలో జోరుగా జరిగింది. కాని తాటి వెంకటేశ్వర్లు అనంతరం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొనటం కేసీఆర్ ను పొగడ్తలతో ముంచెత్తడం చేయటంతో ఆ టాపిక్ కి చెక్ పడింది. ఇప్పుడు మరోసారి బీఆర్ఎస్ నాయకత్వంపై విమర్శలు చేయడమే కాకుండా తాడోపేడో తేల్చుకుంటా అనే విధంగా వ్యాఖ్యలు చేయడంతో ఈసారి ఏం జరగబోతుందో అనే చర్చ జోరందుకుంది అయితే ఇప్పటికే పలుమార్లు పార్టీ మారడంతో తాటిపై నిలకడలేని నేత అనే ప్రచారం కూడా ఉంది..జిల్లా అధ్యక్షుడు

# దేవుడిని అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలు



అమరావతి, వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడమే ఏకైక అజెండాతో చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని వైకాపా నేత, అంబటి రాంబాబు మండిపడ్డారు. ఏడాదిన్నర కాలంలో అనేక నిదర్శనాలున్నాయి.సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నీచరాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాలను , దైవాన్ని అడ్డుపెట్టుకుని ఘోరమైన తప్పిదాలు చేస్తున్న చంద్రబాబును ఆ దేవుడు కూడా క్షమించడని అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడానికి తన ఎల్లో మీడియాను వాడుకుంటారు. వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష తీర్చుకునేందుకు ముందుగా కొన్ని కథనాలను రాయిస్తారు. ఏదో జరిగిపోతుందనే భావన ప్రజలకు కలిగేలా చేస్తారు. ఆ తర్వాత ఏదో పెద్ద నేరం చేసేశారని నమ్మించడానికి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేస్తారు.చంద్రబాబు మోచేతి నీళ్లు తాగే ఐపీఎస్ అధికారులతో సిట్ వేసి విచారణ చేయిస్తారు. ఎవరో ఒకరిని తీసుకొచ్చి బలవంతంగా వారితో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పిస్తారు. బెదిరించి వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పిస్తారు.లేదంటే భౌతికంగా దాడి చేసి చెప్పిస్తారు. బలవంతంగా పేర్లు చెప్పించడం .. వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడమే చంద్రబాబు ప్రభుత్వం పని. దేవుడిని సైతం తన స్వార్థ రాజకీయాలకు వాడుకునే నీచమైన స్థితికి చంద్రబాబు దిగజారిపోయారు. చంద్రబాబు రాజకీయ కక్షలకు తిరుపతి వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని అడ్డుపెట్టుకుంటున్నారు.టిటిడిని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్‌పై బురదజల్లుతున్నారు. పరమ పవిత్రమైన తిరుపతి లడ్డూని కల్తీ అయ్యిందని చంద్రబాబు దుర్మార్గంగా ప్రచారం చేశారు. జగన్‌పై బురద చల్లడానికే చంద్రబాబు ఇలాంటి తప్పుడు ప్రచారం చేశారు. పవిత్రమైన లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ అసత్య ప్రచారం చేశారు.సీబీఐ విచారణ జరిపించాలని మాజీ టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.కోర్టు సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ద్వారా విచారణ చేయించాలని చెప్పింది. దేవుడిని సైతం రాజకీయాలకు వాడుకోవద్దని చంద్రబాబుకు చురకలు అంటించింది. కోర్టుకు వెళ్లినందుకు వైవీ సుబ్బారెడ్డిపై కక్ష తీర్చుకునేందుకు వరుస కథనాలు రాయించారు. చిన్న అప్పన్న అనే వ్యక్తిని జూన్ 6వ తేదీన సిట్ విచారించింది. వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పాలని చిన్న అప్పన్నపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఏపీలో ఏదైనా పెద్ద ఇష్యూ జరగగానే లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తెస్తారు.నెయ్యిలో కల్తీ ఉందని ఇంత వరకూ నిరూపించలేకపోయారు. లడ్డూ ప్రసాదాన్ని ఇప్పటి వరకూ ఎక్కడికీ టెస్టుకు పంపించనే లేదు. కానీ లడ్డూ కల్తీ అయిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చిన్న అప్పన్న 2018 వరకూ వైవి.సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేశారు. అంతకంటే ముందు వేమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి వద్ద కూడా పనిచేశారు. చంద్రబాబు టా÷-గ్గ÷ట్ వైవీ సుబ్బారెడ్డి కాబట్టి వేరే నేతల పేర్లు బయటికి రావు. ఇప్పటి మంత్రి పార్థసారథి గతంలో టీటీడీ పర్చేజింగ్ కమిటీలో ఉన్నారు. వైవీ సుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీ నేత కాబట్టి ఆయన్ని టా÷-గ్గ÷ట్ చేశారు.2014-19 మధ్య చంద్రబాబు హయాంలో నెయ్యి ఖరీదు 276 రూపాయలు మాత్రమే. ఏదో ఒక విధంగా దైవాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ, జగన్‌పై బురదజల్లడమే చంద్రబాబు పని. మా పార్టీ నుంచి ప్రజలను దూరం చేయాలన్నదే చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు,లోకేష్ చేస్తున్నది చాలా నీచమైన రాజకీయం అని విమర్శలు గుప్పించారు. దేవాలయాలను, దైవాన్ని అడ్డుపెట్టుకుని ఘోరమైన తప్పిదాలు చేస్తున్న చంద్రబాబును దేవుడు కూడా క్షమించడు. ఎవరిపై కక్ష తీర్చుకుందాం..ఎవరిని లోపల వేద్దామనేదే చంద్రబాబు ఆలోచన .చంద్రబాబు,లోకేష్ వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు.

# మరోమారు పెరిగిన బంగారం ధరలు

హైదరాబాద్,:ఇటీవలి కాలంలో వరుసగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర సోమవారం మళ్లీ పెరిగింది. తీసుకుంది. 10వతేదీ ఉదయం 9 గంటల తర్వాత బంగారం ధర భారీగా పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 23, 220కి చేరింది. గతంతో పోల్చుకుంటే దాదాపు రూ.1200 పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 11, 950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే దాదాపు రూ.1100 పెరిగింది.ఇటీవల ధర బాగా తగ్గడంతో కొనుగోళ్లు పెరగడమే ఈ పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఇక, ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 23, 370కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 13, 100కి చేరుకుంది.ఇక వెండి ధరల్లో కూడా భారీ పెరుగుదల నమోదైంది. కేజీకి 2,500 రూపాయల మేర వెండి ధర పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 1, 67, 000గా ఉంది. ఇక, ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1, 55, 000గా ఉంది. పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు మీక్షించుకోవాల్సి ఉంటుంది.

# రేవంత్ చెప్పిన లాజిక్ ఇదీ

హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాబోయే ఎన్నికల విషయంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో మాట్లాడుతూ రానున్న పదేళ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఆయన గట్టి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఎన్నికల తేదీపై స్పష్టత

జమిలీ ఎన్నికల ప్రతిపాదనను స్పష్టంగా తోసిపుచ్చారు సీఎం రేవంత్. ఆయన మాట్లాడుతూ "2028లో కాదు, ఖచ్చితంగా 2029 జూన్‌లోనే సాధారణ ఎన్నికలు జరుగుతాయి. అప్పటి వరకు.. 2034 జూన్ వరకు కూడా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుంది'' అని ప్రకటించారు.ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ తెలంగాణలో ఎంత బలమైన పార్టీ. తెలంగాణ ప్రాంతంలో ఒక ఉవ్వెత్తున ప్రభావితం చూపిన తెలుగుదేశం పార్టీ, ఈరోజు లేదు. గతంలో ప్రజలు టీడీపీకి, కాంగ్రెస్‌కు, చంద్రశేఖర్ రావుకి చెరో పది సంవత్సరాలు అధికారాన్ని ఇచ్చారని గుర్తు చేస్తూ అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి కూడా మరో పది సంవత్సరాలు అవకాశం ఇస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పదేళ్ల కాలంలో శతాబ్దానికి సరిపోయే అభివృద్ధి సాధిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

గత సీఎంల విధానాలే ప్రేరణ

తమ ప్రభుత్వం గత ముఖ్యమంత్రులు అవలంబించిన అభివృద్ధి దిశనే కొనసాగిస్తుంది అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటీ, ఫార్మా రంగాల అభివృద్ధిలో గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్రను, ముఖ్యంగా నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, చంద్రబాబు నాయుడు , వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి వేసిన ఐటీ పునాది కారణంగానే నేడు హైదరాబాద్ 'నాలెడ్జ్ హబ్'గా నిలబడిందని ఆయన గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు , ఔటర్ రింగ్ రోడ్ వంటి మౌలిక వసతులు హైదరాబాద్‌కు జీవనాడిలా మారాయని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకున్న దూరదృష్టి నిర్ణయాల వల్లే నేడు హైదరాబాద్ జీసీసీలు, డేటా సెంటర్లకు హబ్‌గా ఎదిగిందని ఆయన అన్నారు.

కేసీఆర్‌పై వ్యంగ్య చమత్కారం

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కాంగ్రెస్ పాలనా కాలాన్ని "500 రోజులు మాత్రమే" అని పేర్కొనడంపై రేవంత్ రెడ్డి చురకలు అంటించారు. "2025 డిసెంబర్‌కి రెండేళ్లు పూర్తయితే, అప్పుడు దాదాపు 1000 రోజులు అవుతాయి. కేసీఆర్ గారి లెక్కలు అమెరికా టైమ్‌జోన్ ప్రకారమా, లేక కలలో వేసిన లెక్కలా అర్థం కావడం లేదు" అంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ దూరదృష్టి పాలన

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దూరదృష్టితో పాలన సాగిస్తుందని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. "2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధి ఆగలేదు. అదే కొనసాగింపుగా 2024 నుంచి 2034 వరకు కూడా ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ దేశానికి దిశా నిర్దేశం చేసే శక్తిగా నిలుస్తుంది" అని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో దీర్ఘకాలిక పాలనపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న అపారమైన విశ్వాసాన్ని స్పష్టం చేస్తున్నాయి. గత అభివృద్ధి ఫలాలను కొనసాగిస్తూ, తెలంగాణను జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దుతామనే ఆయన హామీలు భవిష్యత్తు రాజకీయ చర్చలకు కొత్త ఊపునిచ్చాయి.ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ తెలంగాణలో ఎంత బలమైన పార్టీ. తెలంగాణ ప్రాంతంలో ఒక ఉవ్వెత్తున ప్రభావితం చూపిన తెలుగుదేశం పార్టీ, ఈరోజు లేదు.

# కూటమికి థ్యాంక్స్..!

అమరావతి,వైసీపీ అధినేత జగన్‌కు సోదరి, 2019లో దారుణ హత్యకు గురైన వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతకు బిగ్ రిలీఫ్ దక్కింది. తన తండ్రి దారుణ హత్యపై న్యాయ పోరాటం చేస్తున్న సునీత అనేక మెట్లు ఎక్కుతూనే ఉన్నారు.ఇప్పటికీ న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే ఈ క్రమంలో బాధితులుగా ఉన్న సునీతపైనే వైసీపీ హయాంలో కేసులు నమోదయ్యాయి. కారణాలు ఏవైనా, అప్పటి పోలీసులు ఆమెపైనే కేసు పెట్టారు.సునీత సహా ఆమె భర్త రాజశేఖరరెడ్డిపై అప్పటి కడప పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరిలో ఒకరు ఏఎస్ఐ, మరొకరు ఏఎస్పీ. అయితే ఈ కేసులను తాజాగా తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ఇది ఒకరకంగా సునీతకు బిగ్ రిలీఫ్ అనే చెప్పాలి. ఇప్పుడు దీనికి మించిన రిలీఫ్ ఇస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అప్పట్లో సునీత దంపతులపై కేసులు నమోదు చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టేందుకు ప్రయత్నిస్తోంది.అంటే అప్పట్లో సునీత, ఆమె భర్తపై కేసులు పెట్టిన ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ రాజేశ్వర్‌రెడ్డిలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. వాస్తవానికి ఈ ఇద్దరూ గత ఏడాదే రిటైరయ్యారు. అయినప్పటికీ వారిపై శాఖాపరమైన దర్యాప్తు చేయించడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలను కూడా నిలిపివేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అంతేకాదు అసలు ఈ కేసులు నమోదు చేయాలని తెర వెనుక నుంచి ఎవరు ప్రోత్సహించారన్న విషయంపైనా కూపీ లాగనుంది.మరోవైపు సునీతపై తప్పుడు కేసులు నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లింగాలకు చెందిన కుళ్లాయప్ప అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీంతో ఇది మరింతగా సదరు రిటైర్డ్ అధికారుల మెడకు చుట్టుకోనుంది. ఈ ఫిర్యాదుతో కొత్తగా కేసు నమోదు చేయనున్నారు. ఒకప్పుడు ఫిర్యాదులు స్వీకరించి కేసులు నమోదు చేసిన అధికారులే ఇప్పుడు నిందితులుగా మారనుండటం విశేషం.మొత్తంగా వివేకా కేసులో ఇన్నేళ్ల తర్వాత సునీతకు కొంతలో కొంత బిగ్ రిలీఫ్ దక్కినట్టయింది.

# చీకటి పడితే చాలు వణికిస్తున్న చలి... ఫులి




హైదరాబాద్,మొన్నటి వరకు అయితే భానుడి భగభగలు.. లేదంటే వరణుడి ఉరుములతో తెలుగు రాష్ట్రాల ప్రజలకు చుక్కలు కనిపించాయి. ఇప్పుడు నా వంతు అంటూ చలిగాలులు ఎంట్రీ ఇచ్చాయి. ఇప్పుడు ప్రజలను ఈ గాలులు వణికిస్తున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. జస్ట్ రెండు, మూడు రోజుల వ్యవధిలోనే ఉష్ణోగ్రతలు.. 10 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పడిపోయాయి. అయితే ఇది కాదు.. అసలు కథ ముందుంది అంటోంది వాతావరణశాఖ. రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు. వాతావరణశాఖ విడుదల చేసిన లేటెస్ట్ లెక్కల ప్రకారంఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 5 నుంచి 7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ రెండు జిల్లాల్లో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు ఈ స్థాయికి పడిపోవడంతో ఉదయం కూడా దట్టమైన పొగమంచు ఆవరించి ఉంటోంది. రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-20 డిగ్రీల నుంచి 9-13 డిగ్రీల మధ్యకు చేరుకున్నాయి. అయితే, రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగబోతుంది. అవును.. నవంబరు 11-19 తేదీల వరకు అనగా రాబోయే పది రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉండనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.ముఖ్యంగా 13-17 తేదీల మధ్య మరింత అధికంగా ఉంటుందని, కొన్ని జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్ అంటే పది డిగ్రీల లోపు పడిపోనున్నాయని పేర్కొంది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, విజయనగరం, వైఎస్సార్ కడప, ప్రకాశం, అనకాపల్లి, నంద్యాల, పార్వతీపురం మన్యం, పల్నాడు, తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 నుంచి 20 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి.రాబోయే పది రోజుల్లో చాలా జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు అధికారులు. ముఖ్యంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు అధికారులు. గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా 30 డిగ్రీల వరకే నమోదవుతాయన్నారు. చలి తీవ్రత పెరుగుతుండటంతో పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.ఉత్తర భారతదేశంలో ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు మారిపోయాయి. జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఇప్పటికే మంచు వర్షం ప్రారంభమైంది. యూపీ, ఢిల్లీ, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లలో కూడా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. రాజస్థాన్‌లో కూడా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో కోల్డ్ వేవ్ పరిస్థితులు నెలకొన్నాయని అధికారులు తెలిపారు. చాలా రాష్ట్రాల్లో తెల్లవారుజామున పొగమంచు కురుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటికే కాలుష్యంతో సతమతమవుతున్న ప్రజలకు.. ఇప్పుడు చలి కూడా తోడైంది. రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. ఇక హిమాచల్, ఉత్తరాఖండ్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పటికే మంచు కురవడం ప్రారంభమైంది. ఇది ఊహించిన దానికంటే చాలా ముందు సమయం అంటున్నారు అధికారులు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. ఈ సారి రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం కనిపిస్తోందని చెబుతున్నారు. మరోవైపు నవంబర్ 11 నుండి 19 వరకు (ప్రధానంగా 13 నుండి 17 నవంబర్ వరకు) 8-10 రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతవరణ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాలకు సమీపంలోని దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు చలి, ఉష్ణోగ్రతలు 14°C -17°C మధ్య ఉండవచ్చుని.. సాధారణంగా ఇంత దీర్ఘకాలం చలి తీవ్రత తరచుగా ఉండదు, కానీ ఈ సంవత్సరం 8-10 రోజుల పాటు తీవ్రమైన చలి వాతావరణం ఉండబోతోందని పేర్కొన్నారు

# భారీ ప్లాన్ లో జగన్...బెంగళూరు నుంచే స్కెచ్



అమరావతి,వైసీపీ అధినేత వైఎస్ జగన్ భారీ ప్లాన్ లో ఉన్నారా. పార్టీ గ్రాఫ్ ని అలా ఇంచి ఇంచి పెంచుకుంటూ పోవాలని చూస్తున్నారా అంటే జరుగుతున్న పరిణామాలు అదే నిజం అంటున్నాయి. జగన్ ఇంకో రెండు నెలలలో పూర్తి స్థాయిలో జనంలోకి వస్తాయని అంటున్నారు. అన్నీ అనుకూలిస్తే కొత్త ఏడాది 2026 సంక్రాంతి తరువాత జగన్ మార్క్ యాక్షన్ ప్లాన్ తో రంగంలోకి దిగుతారు అని అంటున్నారు.

బస్సు యాత్ర ముందు :

ఇక జగన్ బస్సు యాత్రతో ప్రజల వద్దకు రావాలని చూస్తున్నారు. ఏపీలో 26 పార్లమెంట్ సీట్లు ఉన్నారు. అలా ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో జగన్ బస్సు యాత్ర చేస్తారని పార్టీ పరిస్థితిని సమీక్షించుకుంటూ వీలున్న చోటల్లా జనాలతో కనెక్ట్ అవ్తూఅరు అని అంటున్నారు. ఈ విధంగా వరానికి నాలుగైదు రోజుల పాటు ఆయన పార్లమెంట్ నియోజకవర్గంలో బస్సు ద్వారా పర్యటిస్తారు అని అంటున్నారు. పార్టీ గ్రౌండ్ లెవెల్ లో ఎలా ఉంది, నాయకుల పనితీరు ఏమిటి క్యాడర్ మనో భావాలు ఎలా ఉన్నాయి. ప్రత్యర్థి పార్టీల బలాలు బలహీనతలు ఏమిటి అన్నది కూడా జగన్ పూర్తిగా స్వయంగా అధ్యయనం చేస్తారు అని అంటున్నారు.

ప్లీనరీతో దూకుడు :

ఇక వైసీపీ ప్లీనరీని కూడా 2026లో ఘనంగా నిర్వహిస్తారు అని అంటున్నారు. జూలైలో వైఎస్సార్ జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు జరుగుతుంది అని అంటున్నారు. 2022 జూలైలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఎంతో గొప్పగా ప్లీనరీ సాగింది. ఆ తరువాత మళ్ళీ నిర్వహించినది లేదు. అయితే ఈసారి ప్రతిపక్షంలో ఉండడంతో క్యాడర్ లో ఊపు తీసుకుని వచ్చేందుకు బ్రహ్మాండంగా నిర్వహించాలని జగన్ చూస్తున్నారు అని అంటున్నారు.

పాదయాత్ర కోసమే :

ఇక జగన్ పాదయాత్రను 2027లో ప్రారంభిస్తారు అని అంటున్నారు. దనికి సంబంధించిన విషయాలను కూడా ప్లీనరీలో చర్చిస్తారు అని అంటున్నారు ఆ మీదట ఏకంగా అయిదు వేల కిలోమీటర్లతో భారీ పాదయాత్రకు జగన్ శ్రీకారం చుడతారు అని అంటున్నారు. ఈసారి రెండేళ్లకు పైగా పాదయాత్ర సాగుతుందని 2029 ఎన్నికలకు ఈ పాదయాత్ర ఒక బూస్ట్ గా పనిచేస్తుందని జగన్ నమ్ముతున్నారు.

బూత్ లెవెల్ నుంచి :

ఇక పార్టీని ముందు పటిష్టం చేయడం కోసం జగన్ చూస్తున్నారు. బూత్ లెవెల్ నుంచి రాష్ట్రంలో పార్టీ అత్యున్నత వేదిక అయిన పీఏసీ దాకా పార్టీకి కొత్త నాయకత్వాన్ని యువ నాయకత్వాన్ని ఇవ్వాలని జగన్ భావిస్తున్నారు అని అంటున్నారు. సీనియర్ల సేవలను ఉపయోగించుకుంటూనే పార్టీలో యంగ్ బ్లడ్ ని తీసుకుని రావాలని చూస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే వైసీపీలో ఇన్నాళ్ళూ సాగుతున్న సైలెంట్ కి చెక్ పెడుతూ 2026 లో జగన్ బస్సు దూసుకుని వస్తుందని అంటున్నారు. చూడాలి మరి

# పరీక్ష లేకుండానే డ్రైవింగ్ లైసెన్స్ - ఇక నుంచి నేరుగా, తాజా మార్పులు..!!




హైదరాబాద్,డ్రైవింగ్ లైసెన్సుల జారీ పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరింత పారదర్శకంగా లైసెన్సుల జారీ దిశగా కసరత్తు చేస్తోంది. డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల ద్వారా ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి పరీక్ష లేకుండానే లైసెన్సు జారీ విధానం అమల్లోకి తెస్తోంది.తాజాగా కేంద్ర రవాణా శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు మరో 53 అందుబాటులోకి వచ్చాయి. దీంతో, కొత్తగా డ్రైవింగ్ లైసెన్సుల జారీ విధానంలో మార్పులు రానున్నాయి.రాష్ట్రంలో డ్రైవింగ్స్ లైసెన్సుల జారీ మరింత పకడ్బందీగా తీర్చిదిద్దేలా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు చాలా మంది సరైన శిక్షణ లేకుండానే లైసెన్స్ పొందడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటంతో, రవాణాశాఖ ఈ సమస్యను గమనించింది. ఈ నేపథ్యంలో కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాప్తంగా 53 డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు (డీటీసీలు) స్థాపించడానికి ఆమోదం లభించింది.అదనంగా 5 ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు (ఆర్‌డీటీసీలు) కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రాల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాలు నడపడం నేర్పుతారు. ఇందులో శిక్షణ మూడు విధాలుగా ఉంటుంది, తరగతుల ద్వారా నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు సిమ్యులేటర్లపై డ్రైవింగ్ ప్రాక్టీస్, ప్రత్యేక ట్రాక్‌లపై ప్రాక్టీసు చేయించేలా నిర్ణయించారు.కాగా, వీటిల్లో శిక్షణ పూర్తి చేసిన వారికి, రవాణాశాఖ ఆఫీసులో డ్రైవింగ్ పరీక్షకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. డీటీసీ నుంచి శిక్షణ సర్టిఫికెట్ పొందిన వారికి నేరుగా లైసెన్స్ జారీ చేస్తారు. ఇది డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారికి ఎంతో మేలు చేయనుంది. ఏయే లైసెన్సులకు ఎన్ని రోజులు ట్రైనింగ్..ఫీజులు వివరాలను వెల్లడించనున్నారు. రాష్ట్రానికి మంజూరైన 5 ఆర్‌డీటీసీలు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.ఇక్కడ శిక్షణ పొందిన వారు లైసెన్స్ కోసం ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌కు వెళ్లకుండానే అక్కడికక్కడే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసి మంజూరు చేస్తారు. ఇప్పటికే ఎన్టీఆర్, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల నుంచి 2 చొప్పున, అనంతపురం, కృష్ణా, తిరుపతి, పశ్చిమగోదావరి, బాపట్ల, కాకినాడ జిల్లాల నుంచి 1 చొప్పున దరఖాస్తులు అందాయి. వచ్చే ఏడాది నాటికి అన్ని డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్ణయించారు.

# ఇంతకీ చొరబాటుదారులంటే ఎవరు?



న్యూఢిల్లీ,బీహార్ శాసనసభ ఎన్నికల తొలి దశ పోలింగ్ ముగిసింది. అయినప్పటికీ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో చొరబాటుదారులున్నారని ప్రధానితో సహ కేంద్ర హోంమంత్రి, ఇతర బీజేపీ పెద్దలు ఇంకా ప్రచారం చేస్తూనే ఉన్నారు. కానీ అధికారిక సమాచారం దీనికి కొంత భిన్నంగా ఉంది. అసలు చొరబాటుదారులంటే ఎవరనేది మోదీ, అమిత్‌షా స్పష్టంగా నిర్వచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.తమ సొంత దేశాన్ని విడిచి భారతదేశంలోకి చట్టవిరుద్ధంగా వచ్చేవారిని చొరబాటుదారులంటారా? లేక దేశంలోని ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి వివిధ కారణాల వల్ల వెళ్లి అక్కడ స్థిరపడిన పౌరులను కూడా చొరబాటుదారులుగా గుర్తిస్తున్నారా? బీహార్‌లో ఇప్పటికే ఎస్ఐఆర్‌ను పూర్తిచేశారు. మరి చొరబాటుదారులెవరన్నది ఎన్నికల సంఘం ఇంకాను గుర్తించలేకపోయిందా?ఇక అసలు విషయానికి వస్తే, పాస్‌పోర్టు-విదేశీయుల చట్టాల కింద 2023లో కేవలం 5గురుపై బీహారులో కేసులు నమోదయ్యాయి. 2022లో మూడు, 2021లో ఒక కేసు మాత్రమే ఈ చట్టాల కింద నమోదైందని నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ఆలస్యంగా విడుదల చేసిన "క్రైమ్ ఇన్ ఇండియా నివేదిక- 2023"లో వెల్లడించింది.

దేశ పరిస్థితిని గమనిస్తే..

2023లో విదేశీయుల నమోదు చట్టం- 1939, విదేశీయుల చట్టం- 1946, పాస్‌పోర్టు చట్టం- 1967, ఇమ్మిగ్రేషన్ చట్టం- 1983, పౌరసత్వం చట్టం-1955ల కింద 2,290 కేసులు నమోదయ్యాయని నివేదిక తెలిపింది. ఈ చట్టాల కింద ఎక్కువగా పశ్చిమ బెంగాల్లో 1050 కేసులు నమోదు కాగా త్రిపురలో 277, మహారాష్ట్రలో 272, తమిళనాడులో 167, పంజాబ్‌లో 78 కేసులు నమోదైనట్లు పేర్కొన్నది."ప్రిజన్ స్టాటిక్టిక్స్ ఆఫ్ ఇండియా-2023"ని కూడా విడుదల చేశారు. ఈ వివరాల ప్రకారం జైళ్లలో ఖైదీలుగా ఉన్న విదేశీయుల సంఖ్య 2022లో 6,283 నుంచి 2023లో 6,956కు చేరుకుంది. అంటే 10.7% ఖైదీల సంఖ్య పెరిగింది. వీరిలో దోషులుగా నిర్ధారించబడి శిక్షను అనుభవిస్తున్న వారు 1,499బీ నేరారోపణలతో విచారణను ఎదుర్కొంటున్నవారు 5,167 మంది ఉన్నారు.రాజ్యానికి వ్యతిరేకంగా 2022లో 5,610బీ 2023లో 4,873 అంటే 13.1% నేరాల కేసులు నమోదయ్యాయి. ఇవికాక పర్యావరణ సంభందిత కేసులు 2023లో 68,994బీ 2022లో 52,920 కేసులు నమోదయ్యాయాని నివేదిక వివరించింది.

# బాబు మంత్రులకు కొత్త అనుభవం



అమరావతి,ఏపీలో గత ఏడాదిన్నర కాలంలో అనేక సార్లు మంత్రి వర్గ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగే మంత్రి వర్గ భేటీలో మంత్రులకు బాబు క్లాస్ తీసుకున్నారనో లేక వారి మీద సీరియస్ అయ్యారనో లేక దిశా నిర్దేశం చేశారనో వార్తలు వస్తూ ఉండేవి. మంత్రులు మరింత చురుగ్గా పనిచేయాలని బాధ్యతగా మెలగాలని బాబు కోరినట్లుగా కూడా ప్రచారం జరిగేది. కానీకేనెట్ మీట్ మాత్రం మంత్రులకు కొత్తఅనుభవం ఇచ్చింది అని అంటున్నారు.

భేష్ అన్న బాబు :

చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన పనిమంతుడు. ఆయన తానుగా ఎంత పనిచేస్తారో అంతకు అంత తన మంత్రుల నుంచి ఆశిస్తారు. అయితే గతంలో బాబు పలు మార్లు చెప్పడం వల్ల మంత్రులు అంతా జాగ్రత్త పడ్డారు. చాలా మంది ఫీల్డ్ లోకి దిగి మునుపటి కంటే సామర్ధ్యాన్ని పెంచుకున్నారు. అంతే కాకుండా అనేక మంది తమ పనితీరుని మెరుగుపరచుకున్నారు. అదే ఈసారి బాబు నుంచి మెప్పు పొందడానికి ఉపకరించింది అని అంటున్నారు. మంత్రులు అందరినీ శభాష్ అని చంద్రబాబు మెచ్చుకోవడంతో అంతా ఫుల్ జోష్ లో ఉన్నారని అంటున్నారు.

మొంథా తుఫాన్ సమయంలో :

ఏపీని గత నేల చివరి వారం మొంథా తుఫాన్ పెద్ద ఎత్తున కమ్మేసింది. అంతే కాదు మరో హుదూద్ అని కూడా ప్రచారం సాగింది. ఎంత పెద్ద ప్రమాదమో ఎంత కష్టం నష్టమో అని అంతా తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఉంది. అయితే చంద్రబాబు మంత్రులు అంతా తుఫాన్ విషయంలో ప్రజలకు తగిన జాగ్రత్తలు చెప్పి అప్రమత్తం చేయడమే కాకుండా తుఫాన్ అనంతరం కూడా ఫీల్డ్ లోకి దిగి పూర్తి కాలం పనిచేశారు. నిలువెత్తు లోతు నీళ్ళలోకి పంట పొలాల్లోకి పాడైన రోడ్ల వద్దకు కూడా చేరుకుని మరీ అక్కడే సమీక్షలు చేశారు. ప్రజలని కాపాడడమే కాకుండా రిలీఫ్ విషయంలో కూడా బాగానే చర్యలు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి విమర్శలు రకౌండా సహాయ చర్యలు అందాయి. అంతా ఒక పద్ధతి ప్రకారం జరగడంతో మొంథా తుఫాన్ ప్రభావం బాగా తగ్గింది. అంతే కాకుండా ప్రజలకు కూడా కష్టం నష్టం బాగా తగ్గించారు అన్న పేరు వచ్చింది.

బాబు హ్యాపీయేనా :

తన కేబినెట్ సహచరుల నుంచి చంద్రబాబు ఇదే కోరుకుంటున్నారు అని అంటున్నారు. పై నుంచి దిగువ దాకా అంతా ఒక విధానంతో పనిచేయాలని ఆయన పదే పదే చెబుతున్నారు.ఆ టీం స్పిరిట్ అయితే ఇపుడు బాగా కనిపించింది అని అంటున్నారు ఒక పెద్ద ప్రకృతి విపత్తి సంభవించినపుడు కేబినెట్ అంతా ఏకమొత్తంగా రియాక్ట్ కావడం ఏ చిన్న ఇబ్బంది లేకుండా చూసుకోవడంతో బాబు సైతం ఫుల్ హ్యాపీ అని అంటున్నారు. అందుకే బాబు మెచ్చుకున్నారని చెబుతున్నారు. దీంతో మంత్రులు ఇదే స్పీడ్ తో ముందుకు సాగితే కూటమి సర్కార్ అభివృద్ధి విషయంలో కూడా పరుగులు పెడుతుందని అంటున్నారు.

# బీహార్ తొలి దెబ్బ సిద్ధూ మీదనేనా ?



న్యూఢిల్లీ,బీహార్ లో రెండో విడత చివరి విడత ఎన్నికలు మంగళవారంతో పూర్తి అయిపోతున్నాయి. ఇక రెండు రోజుల తరువాత కౌంటింగ్ ఉంది. ఈ నెల 14న ఫలితాలు వస్తాయి. బీహార్ లో ఎవరి గెలిచేది జనాలు తీర్పు ఇస్తారు. ఈసారి ఫలితం అయితే మహా ఘట్ బంధన్ కి అనుకూలంగా ఉంటుందని ఇండియా కూటమి నేతలు చాలా నమ్మకంగా ఉన్నారు. ఈసారి ఘట్ బంధన్ గెలిచి బీహార్ కైవశం అయితే మాత్రం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ క్రెడిట్ లో సింహ భాగం అందుకుంటారు అని అంటున్నారు. ఆయన బీహార్ ఎన్నికల కంటే ముందే నిర్వహించిన ఓటర్ చోరీ యాత్రకు బ్రహ్మాండమైన స్పందన లభించింది. ఒక విధంగా జనాల మూడ్ ని ముందే మార్చేసినట్లుగా కూడా చెబుతున్నారు.

గెలిస్తే జరిగేది :

ఇండియా కూటమి కట్టాక వరస పరాజయాలే పలకరించాయి. కేంద్రంలో 2024 ఎన్నికల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తామని వేసుకున్న అంచనాలు తప్పాయి. మూడోసారి కూడా మోడీ ప్రధానిగా ప్రమాణం చేసి హ్యాట్రిక్ పీఎం అనిపించుకున్నారు. ఇక హర్యానా మహారాష్ట్రలలో కూడా పెట్టుకున్న ఆశలు నిరాశ అయ్యాయి. అక్కడా ఎన్డీయేదే పై చేయి అయింది. ఢిల్లీలో చూసుకుంటే రెండున్నర దశాబ్దాల తరువాత బీజేపీ గెలిచి జెండా ఎగరేసింది.

బీహార్ బూస్ట్ :

సరే ఇన్ని రకాలుగా ఇబ్బంది పడుతున్నా ఇండియా కూటమి కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలని నిర్ణయించుకుని మరీ బీహార్ బరిలోకి దిగింది. బీహార్ లో కనుక అధికారం దక్కితే మెల్లగా హిందీ బెల్ట్ ని పాకేందుకు ఆస్కారం ఉంటుందని దేశంలో అత్యధికం ఎంపీ సీట్లు ఉన్న ఉత్తరాదిన మార్పు కచ్చితంగా వస్తుందని అది 2029 ఎన్నికల్లో బాగా దోహదపడుతుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. అంతే కాదు బీహార్ ఇచ్చిన బూస్ట్ తో ఇండియా కూటమి మరింత శక్తివంతంగా మారి ఎన్డీయే మీద ఢీ కొట్టేందుకు ఇంకా కొత్త ఉత్సాహం చూపిస్తుంది అని అంటున్నారు.

రాహుల్ కీ రోల్ :

కాంగ్రెస్ అగ్ర నేతగా ఉన్న రాహుల్ గాంధీ పార్టీలో కీలక నిర్ణయాల విషయంలో ఇంతకాలం ఆచీ తూచీ వ్యవహరిస్తూ వచ్చారు. కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నా వాయిదా వేస్తూ వచ్చారు. దానికి కారణం దేశంలో ప్రజల మూడ్ నాడి అందిపుచ్చుకుని తమకు సానుకూలం చేసుకునేందుకే ఈ ప్రయత్నం అని అంటున్నారు. ఇపుడు బీహార్ కనుక ఇండియా కూటమికి దక్కితే కాంగ్రెస్ సంస్థాగతంగా కూడా మరింత బలంగా మారి సంచలన నిర్ణాయలు తీసుకునే చాన్స్ ఉంది అని అంటున్నారు. రాహుల్ సైతం ఎటువటి తడబాటూ తాత్సారం లేకుండా ముఖ్యమైన నిర్ణయాలనే తీసుకుంటారు అని అంటున్నారు.

కర్ణాటక ఫోకస్ :

ఇక లేటెస్ట్ గా చూస్తే కన్నడ కాంగ్రెస్ సీఎం సిద్ధరామయ్యకు కేంద్ర కాంగ్రెస్ పెద్దల అపాయింట్మెంట్ లభించలేదు అని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. నిజానికి చూస్తే కనుక కేంద్ర కాంగ్రెస్ పెద్దలతో సమావేశం కావాలని సిద్ధరామయ్య భావించారు, కానీ ఆ సమావేశం అవసరం లేదని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని అంటున్నారు. దాంతో కర్ణాటక సీఎం పీఠం కదులుతోందని వార్తలు జోరుగా షికారు చేస్తున్నాయి.

మాట ప్రకారం :

ఇక చూస్తే రెండున్నరేళ్ళ తర్వాత సిద్ధరామయ్య దిగిపోయి డీకే శివకుమార్ కి బాధ్యతలు అప్పగిస్తారు అని చాలా కాలంగా ప్రచారం ఉంది. ఆ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తోంది. దాంతో డీకేకి కన్నడ పగ్గాలు అప్పగించడానికి కాంగ్రెస్ పెద్దలు నిర్ణయించారా అందుకే సిద్ధరామయ్యకు అపాయింట్మెంట్ ఇవ్వలేదా అన్నది కూడా చర్చ సాగుతోంది. ఇక బీహార్ లో కనుక కాంగ్రెస్ కూటమి గెలిస్తే రాహుల్ గాంధీకి కాంగ్రెస్ కి కూడా మంచి బలం వస్తుందని దాంతో సంస్థాగతంగా కీలక నిర్ణయాలు మరింత దూకుడుగా తీసుకునే చాన్స్ ఉందని అంటున్నారు. అలా చూసుకుంటే బీహార్ తొలి దెబ్బ కన్నడ సిద్ధూకే తగులుతుందా అన్నది ఇపుడు పొలిటికల్ గా హాట్ టాపిక్ గా ఉంది.

# బడి భోజనంలో గుడ్లు బంద్.. హైదరాబాద్‌లో నిలిచిన సరఫరా



హైదరాబాద్ , కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల మూసివేతలు, సిబ్బంది తొలగింపుతోపాటు విద్యార్థుల భోజనానికి కూడా కొర్రీలు పెడుతున్నది. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు సోమ, బుధ, శనివారాల్లో గుడ్లను, మిగిలిన రోజులలో అరటిపండ్లను అందించాలని నిబంధన ఉన్నది. కానీ సర్కారు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఏజెన్సీలు హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు గుడ్ల సరఫరా నిలిపివేశాయి. అక్టోబర్ 15 నుంచే సరఫరా నిలిచిపోయినట్టు తెలుస్తున్నది. దీంతో విద్యార్థులకు పోషకాహారం అందడంలేదు. బహిరంగ మార్కెట్‌లో గుడ్డు ధర రూ.6.50 ఉండగా, ప్రభుత్వం మాత్రం ఒక్కో గుడ్డుకు రూ.2.5 మాత్రమే చెల్లిస్తున్నది. అందుకే విద్యార్థులకు గుడ్లను అందించ లేకపోతున్నామనీ ఏజెన్సీ నిర్వహకులు చెప్తున్నారు. గుడ్లను వడ్డించకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం లేక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులకు మంచి ఆహారం కూడా అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉన్నదా? అంటూ మండిపడుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com